Pubilshed from Ananthapuramu PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




| అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 | సంచిక : 91 | శుక్రవారం | అక్టోబర్ 16, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 04 | Issue No : 91 | Friday | 16 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## సామాన్యుడికే అన్ని చట్టాలు

# పనిచేస్తాయా...!





- ఐఏఎస్ అయితే ఆ చట్టాలు వర్తించవా..
- సామాన్యుడు పబ్ కు వెళ్తే సంకెళ్ళు వేయొచ్చు..
- ఐఏఎస్ అధికారులు వెళ్తే అసంకెళ్ళు చతికిలబడి పోతాయా..
- బీఎన్ఎస్ చట్టం రాష్టానికి సంబంధించిన అంశమా..దేశానికి సంబంధించిన అంశమా..
- ఖాకీలంటే అందరూ ఒకటే కదా..
- బెంగుళూరు,మంగుళూరు,అమరావతి, హైదరాబాద్ లో వేరు వేరు కాదుగా..
- పేదోడు ప్రశ్నిస్తే కేసులు పెట్టి,రిమాండ్ కు పంపుతారే..
- పెద్దోడు ఏమి చేసినా పర్వలేదన్న మాట..
- అందుకే అందరూ ఐఎఎస్ చదివితే సరిపోతుందేమో.
- పరాయి రాష్ట్రం లో ఏమి చేసినా పర్వలేదన్న మాట..
- స్వరాష్ట్రం లో సచివాలయం లో ఉండచ్చన్నమాట..
- ఇది కదా అసలైన ప్రజాస్వామ్యం..
- ఇలాంటి వారితోనే కదా పేద ప్రజలకు మంచి జరిగేది..
- అహో ప్రజాస్వామ్యమా నీకు జోహార్..

(రామమోహన్ రెడ్డి) : ప్రజాస్వామ్యం అంటే ప్రజలే సర్వాధికారులుగా ఉండే ప్రభుత్వ విధానం.అబ్రహం లింకన్ నిర్వచనం ప్రకారం: "ప్రజాస్వామ్యం అంటే ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వం".చట్టం ముందు అందరూ సమానులే అన్నది భారత దేశ ప్రజాస్వామ్యం. భారతదేశం జనాభా పరంగా ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశం. దేశ పరిపాలన అంతా ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అయిన భారత రాజ్యాంగం ప్రకారం జరుగుతుందని నేడు అందరూ చెబుతున్న మాట. పేద అంటే ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి తగినంత సంపద లేదా డబ్బు లేని స్థితి, ధనిక అంటే అవసరానికి మించి విలాసవం తమైన జీవితాన్ని గడపడానికి సరిపడా ఆధిక ధనం లేదా ఆస్తులు ఉన్న స్థితి. ఈ రెండు పదాలు సమాజంలో ఒకరి ఆర్థిక పరిస్థితిని మరియు జీవన ప్రమాణాలను సూచిస్తాయి.

కేవలం ప్రస్తుత అవసరాల గురించే ఆలోచించడం, సంపాదన మొత్తాన్ని ఖర్చులకు లేదా అప్పులు తీర్చడానికే ఉపయోగించడం మాత్రమే తెలిసిన వారు పేదవాడు. డబ్బుతో మరింత డబ్బును ఎలా సంపాదించాలో ఆలోచించడం, కొత్త ఆస్తులను సృష్టించడం మరియు పెట్టుబడులు పెట్టడం పెద్దోడి ఆలోచనా ,జీవన శైలి. కేవలం డబ్బు లేనంత మాత్రాన మనిషి పేదవాడు కాడు. మంచి గుణాలు, సాయం చేసే గుణం ఉన్నవారు ఆర్థికంగా పేదవారైనా మానసికంగా ధనవంతులేనని ఎంత డబ్బు ఉన్నా ఎదుటివారిని గౌరవించని వాడు, తృప్తి లేని వాడు ఎంత సంపద ఉన్నా పేదవాడితో సమానమేనని పురాణాల కాలం నుండి ఉత్తుత్తి పురాణాలు వింటూనే ఉండడం సహజంగా చూస్తునే ఉన్నాం ఈ ప్రజాస్వామ్య దేశంలో.

2 - పేజీలో



భారత్-అమెరికా వాణిజ్య

## ఒప్పందం..

- కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్
- భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి
- ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి
- చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్
- పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

- మిగతా 2లో..

మహిళా శక్తికి వేదికగా

# సరస్ మేళా-2026

- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

2 - పేజీలో

సాధారణ పరిశీలకులుగా

## 28 మంది ఐఏఎస్

# అధికారులు

- నియమించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఎన్నికలను స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాలి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ :

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సాధారణ పరిశీలకులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాకు ఒక అధికారి చొప్పున 28 మంది మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 2లో..



రాష్ట్రంలో ఎక్కడ చూసినా టీడీపీ

# ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు

- తక్షణం చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఈసీకి విజ్ఞప్తి - ఆ మేరకు ఎస్ఈసీకి లేఖ రాసిన వైయస్సార్‌సీపీ

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల దృష్ట్యా ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉన్నా, ఎక్కడా అధికార టీడీపీ దాన్ని పాటించడం లేదని.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సహా, ఆ పార్టీ నాయకుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగ్‌లు, కటౌట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)కు లేఖ రాసిన వైయస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వాటిపై తక్షణం చర్య తీసుకోవాలని, అన్నీ తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.



రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఈ ప్రచార ప్రదర్శనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆ లేఖలో లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి, తమ రాజకీయ పలుకుబడిని ప్రదర్శించడానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇటువంటి ప్రచార సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

2 లో



రాబోయే 3 గంటల్లో

# వానలు ..!

అమరావతి : రాబోయే 3 గంటల్లో ఏపిలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని చిత్తూరు, పుత్తూరు, సత్యవేడు, శ్రీసిటీ, తడ పరిసర ప్రాంతాలలో పిడుగులతో కూడిన మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దానితోపాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నంద్యాల, శ్రీసత్యసాయి

స్టాక్ మార్కెట్‌లో

# భారీ ర్యాలీ..

## 1,500 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్!

- 1,533.72 పాయింట్లు పెరిగి 74,315.61 వద్ద ముగిసిన సెన్సెక్స్
- 374.65 పాయింట్లు లాభపడి 22,997.35కు చేరిన నిఫ్టీ
- 4.03 శాతం ఎగబాకిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు
- టెక్ మహీంద్రా 4.61 శాతం లాభంతో టాప్ గెయినర్
- మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో మాత్రం నష్టాలు



ఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,500 పాయింట్లకు పైగా ఎగబాకగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 23 వేల మార్కుకు చేరువైంది. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు ఊతమిచ్చాయి.

- మిగతా 2లో..

## రాష్ట్రంలో ఎక్కడ చూసినా టీడీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు

ఎన్నికల సమయంలో వర్తించే ఆంక్షలను వారు పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు కూడా ఈ ప్రచార ప్రదర్శనలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవడంతో, ఎన్నికల నియామావళిని నిష్పక్షపాతంగా అమలు చేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని వెల్లడించారు. అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ప్రచార సామగ్రిని ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగించడానికి అనుమతించడం, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికలకు అవసరమైన సమాన అవకాశాల స్థాయిని దెబ్బ తీస్తుందని ఆ లేఖలో లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. కాబట్టి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ ప్రదర్శిస్తున్న ప్రచార సామగ్రిని గుర్తించి వెంటనే తొలగించాలని, కొత్తగా అనధికారికంగా ఏర్పాటు చేసే వాటిని పూర్తిగా నిరోధించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించాలని ఆయన ఎన్నికల కమిషనర్‌ను కోరారు. అలాగే, ప్రతి జిల్లాలో తీసుకున్న చర్యలకు సంబంధించి నిర్ణీత గడువులోగా ఫాలో అప్ నివేదికలను సమర్పించేలా ఆదేశించాలని, ఆదేశాలను అమలు చేయడంలో విఫలమయ్యే అధికారుల బాధ్యతను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా, ఎన్నికల ప్రవర్తనా నియామవళి రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి జాప్యం లేకుండా, సమానంగా, నిష్పక్షపాతంగా అమలయ్యేలా ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలన్న లేళ్ల అప్పిరెడ్డి, ఆ లేఖ ప్రతిని కేంద్ర ఎన్నికల కమిషన్ కు కూడా పంపారు.

## రాబోయే 3 గంటల్లో వానలు ..!

**జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు చెదురుమదురుగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజలు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేసింది.**

## స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ..

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 4 శాతానికి పైగా పెరిగింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి నిలకడగా ఉండటం, విదేశీ పెట్టుబడులు తిరిగి వచ్చే అవకాశాలపై ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి.
సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు పెరిగి 74,315.61 వద్ద ముగిసింది. నిఫ్టీ 374.65 పాయింట్లు లాభపడి 22,997.35 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు బలహీనపడినప్పటికీ, దేశీయంగా భారీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని కంపెనీల అధిక విలువలపై ఆందోళనలు, అమెరికాలో అంచనాలను మించిన ద్రవ్యోల్బణం ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత మార్కెట్లపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా అత్యధికంగా 4.61 శాతం లాభపడింది. ఐసీఐసీఐ బ్యాంక్ 4.17 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.03 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.94 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.58 శాతం పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లూ లాభాల్లో ముగిశాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.
అయితే, అన్ని విభాగాల్లోనూ కొనుగోళ్లు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.36 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.31 శాతం పడిపోయాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లలోనూ ఒత్తిడి కనిపించింది.అంతర్జాతీయ టెక్నాలజీ షేర్లలో బలహీనత భారత భారీ కంపెనీలపై పెట్టుబడుల ఆసక్తిని పెంచిందని విశ్లేషకులు తెలిపారు. బాండ్ ఈల్డ్స్ తగ్గడం, రూపాయి నిలకడ, ముడిచమురు ధరల పతనం మార్కెట్‌కు మద్దతిచ్చాయని వివరించారు. అయితే, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో బలహీనత కారణంగా ఈ ర్యాలీలో అన్ని విభాగాల భాగస్వామ్యం లేదని హెచ్చరించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.1 శాతం బలపడి 95.055 వద్దకు చేరింది. బ్రెంట్ ముడిచమురు ధర 2.06 శాతం తగ్గి బ్యారెల్‌కు 103.87 డాలర్లకు చేరగా, అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ 0.35 శాతం తగ్గి 94.76 డాలర్ల వద్ద ట్రేడైంది. రానున్న రోజుల్లో కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, చిన్న కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ దిశను నిర్ణయించనున్నాయి.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..

**ఢిల్లీ :** భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్



వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు."అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు.ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.
టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సామాన్యుడికే అన్ని చట్టాలు పనిచేస్తాయా..!

భారతీయ న్యాయ సంహిత 2023 అనేది భారతదేశంలో క్రిమినల్ నేరాలను, వాటికి విధించే శిక్షలను నిర్ణయించే అధికారిక శిక్షాస్మృతి. పబ్ అనేది 'పబ్లిక్ హౌస్' దీని అర్థం ప్రజలందరూ వచ్చి కూర్చోవడానికి, సమయం గడపడానికి అనుమతి ఉన్న ఒక బహిరంగ ప్రదేశం. ఇక్కడ వివిధ రకాల మద్యం (ముఖ్యంగా బీర్, వైన్ వంటివి), ఇతర పానీయాలతో పాటు లఘు ఆహారం (స్నాక్స్) లేదా భోజనం లభిస్తాయి. ఈ పబ్ సంస్కృతి ముఖ్యంగా బ్రిటన్, ఐర్లాండ్ వంటి దేశాల సంప్రదాయం నుండి పుట్టింది. ప్రస్తుతం భారతదేశంలోని మెట్రో నగరాల్లో కూడా యువతకు ఇది ఒక ప్రముఖ వినోద కేంద్రంగా మారింది. ఇక పబ్‌లలో గబ్బు చేయడం (అల్లరి, గొడవలు లేదా అసభ్యంగా ప్రవర్తించడం) చట్టబద్ధంగా మరియు సామాజికంగా అస్సలు మంచిది కాదు. పబ్‌లు అనేవి ప్రజలు ప్రశాంతంగా సమయం గడపడానికి, ఎంజాయ్ చేయడానికి వచ్చే ప్రదేశాలు.పబ్‌కు వెళ్లినప్పుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించడం, ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం చాలా ముఖ్యం. పబ్‌లలో పోలీసు అధికారుల తనిఖీలనేవి ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ మరియు నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడానికి జరుగుతుంటాయి. ఇటీవల కాలంలో హైదరాబాద్, సైబరాబాద్ పరిధుల్లోని పలు పబ్‌లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.
పబ్‌లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు వినియోగదారులు తమ గుర్తింపు కార్డును చూపించాలి. పబ్‌లలో మైనర్లకు మద్యం సరఫరా కాకుండా నిరోధించడానికి మరియు వయోపరిమితిని నిర్ధారించడానికి పోలీసులకు ఈ తనిఖీలు చేసే చట్టపరమైన అధికారం ఉంది.
ఐఏఎస్ అనేది భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, ప్రధానమైన సివిల్ సర్వీస్.
ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం, జిల్లా స్థాయిలో కలెక్టర్‌గా లేదా ప్రభుత్వ విభాగాల్లో కీలక పదవుల్లో ఉంటూ పాలనను పర్యవేక్షించడం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నడపడం వీరి ప్రధాన వృత్తి ధర్మం. ఐఏఎస్ అధికారులు సాధారణ పౌరులలాగే పబ్‌లకు వెళ్లవచ్చు, కానీ వారు అక్కడ ప్రవర్తించే విధానంపై కఠినమైన నియమాలు ఉంటాయి. వారు ఆఫ్-డ్యూటీలో (విధులు లేని సమయంలో) ఉన్నప్పుడు తమకు నచ్చిన దుస్తులు ధరించి, పార్టీలకు లేదా పబ్‌లకు వెళ్లడానికి చట్టపరంగా ఎలాంటి నిషేధం లేదు. అయితే, ఆల్ ఇండియా సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్, 1968 ప్రకారం వారు కొన్ని ముఖ్యమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. రూల్ 20 అనుసరించి ఐఏఎస్ అధికారులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మైకంలో తూలడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం చేయకూడదు. పబ్ అనేది మద్యం సర్వ్ చేయడానికి అనుమతి ఉన్న ప్రదేశం అయినప్పటికీ, అక్కడ పరిమితికి మించి తాగి గొడవలు సృష్టించకూడదని చట్టం లో చెప్పబడుతుంది. ప్రజా ప్రవర్తన రూల్ 3 ప్రకారం ఒక ప్రభుత్వ అధికారిగా ఎల్లప్పుడూ సమాజంలో గౌరవప్రదంగా నడుచుకోవాలి. సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించకూడదని రాజ్యాంగ నిబంధనులలో చెప్పబడి ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే ఐఏఎస్ అధికారులు పబ్‌లకు వెళ్లడం తప్పు కాదు, కానీ అక్కడ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం లేదా ప్రభుత్వ అధికారి హోదాను దుర్వినియోగం చేస్తూ రచ్చ చేయడం నిబంధనల ప్రకారం నేరమని రాజ్యాంగ సూత్రాలు చెబుతున్నాయి.
ఐఏఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్, 1969 వర్తిస్తాయి. విధుల్లో అలసత్వం లేదా చిన్నపాటి ప్రవర్తనా లోపాలు ఉంటే సదరు అధికారి సేవా రికార్డులో తప్పును నమోదు చేస్తూ ఇచ్చే రాతపూర్వక హెచ్చరిక,నిర్ణీత కాలం వరకు పదోన్నతి రాకుండా చేయడం, అధికారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం వాటిల్లితే, ఆ మొత్తాన్ని వారి జీతం నుండి రికవరీ చేయడం,వార్షిక జీతపు పెంపును (ఇంక్రిమెంట్లను) తాత్కాలికంగా ఆపివేయడం ఒక విధానం.



తీవ్రమైన అవినీతి, బహిరంగ ప్రదేశాల్లో తీవ్రంగా అసభ్యంగా ప్రవర్తించడం, నేరపూరిత చర్యలు లేదా క్రిమినల్ కేసులు నమోదైనప్పుడు
ఆ అధికారిని ప్రస్తుత పదవి/జీతపు స్థాయి నుండి కింది స్థాయికి తగ్గించడం. సర్వీస్ కాలం పూర్తికాకముందే బలవంతంగా ఉద్యోగం నుండి విరమింపజేయడం, ఉద్యోగం నుండి తీసివేయడం. అయితే, వీరు భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా ఉంటారు.ఇంకా ప్రభుత్వాలు అనుకుంటే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించడమే కాకుండా, వీరు భవిష్యత్తులో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగానికి కూడా అర్హులు కాకుండా చేయొచ్చు.అయితే వీటన్నింటికి ముందు
నిబంధనలు ఉల్లంఘించిన అధికారికి మొదట చార్జ్ షీట్ (మెమో) జారీ చేసి వివరణ కోరతారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే, విచారణ అధికారి ఆధ్వర్యంలో అంతర్గత విచారణ జరుగుతుంది. విచారణ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ శిక్షను ఖరారు చేస్తుంది. తీవ్రమైన శిక్షల విషయంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సలహా కూడా తీసుకుంటారు.ఇది ఒక ఐఏఎస్ ఐపీఎస్ అధికారి తన అధికార దుర్వినియోగం కు పాల్పడినప్పుడు. ఎందుకయ్యా ఈ ఉపోద్ఘాతం అని అనుకోవచ్చు.మరి జరిగిన సంఘటన లో ఒక ఐఏఎస్ అధికారి అయ్యి ఉండి కూడా ఇలా ఇన్ని చట్టాలు తెలిసి బెంగుళూరు పబ్ లో గబ్బు చేయడం అనేది ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న సామాన్యుడు నుండి ఉత్పన్నం అవుతోంది. ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ బెంగళూరు పబ్ వివాదానికి సంబంధించిన వివరాలలోకి వెళితే అక్టోబర్ 10, 2026 అర్ధరాత్రి దాటాక (సుమారు 1:30 గంటల ప్రాంతంలో) బెంగళూరు సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ ఎంక్వయిరీ వింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే తన సిబ్బందితో కలిసి రెసిడెన్సీ రోడ్‌లోని 'క్యావోర్' (ఝుజశీతీవ) పబ్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు.పబ్‌లోని కొందరు యువతుల వయస్సును నిర్ధారించుకోవడానికి పోలీసులు ఐడీ కార్డులు చూపించమని అడిగారు.ఈ తనిఖీ వికాస్ మర్మత్ మరియు అతని స్నేహితులకు ఆగ్రహం తెప్పించింది. దాంతో వారు పోలీసులతో ఘర్షణకు దిగారు. తాను ఐఏఎస్ అధికారిని అని చెప్పుకుంటూ పోలీసులపై తీవ్ర పదజాలంతో దూషించడమే కాకుండా, ఇన్‌స్పెక్టర్‌ను నెట్టివేసి (కొన్ని నివేదికల ప్రకారం చెంపదెబ్బ కొట్టి) దాడికి యత్నించినట్లు ఆరోపణల నేపథ్యం లో అక్కడి పోలీసులు కేసులు నమోదు చేశారు.
ఈ కేసులో వికాస్ మర్మత్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది.అభయ్ ఉదయ్ సింగ్ -- రియల్ ఎస్టేట్ వ్యాపారి.నితీశ్ -- బిహార్‌లో ఒక పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు. రోషన్ -- బౌన్సర్.
బాధిత పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే చికిత్స పొందిన అనంతరం కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా భారతీయ న్యాయ సంహిత (దీచీ) కింద క్రింది సెక్షన్లతో క్రిమినల్ కేసు నమోదైంది.ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం , స్వచ్ఛందంగా గాయపరచడం ,క్రిమినల్ బెదిరింపులు,బూతులు తిట్టడం / అనుచిత ప్రవర్తన చేసినట్లు సదరు ఇన్స్పెక్టర్ పిర్యాదు చేసిన కారణంగా కేసులు నమోదు అయినట్లు అక్కడి పోలీసుల ద్వారా తెలుస్తుంది.తాజా నివేదికల ప్రకారం బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, అయితే నిందితులపై ఇంకా తదుపరి కఠిన చట్టపరమైన చర్యలు (అరెస్ట్ వంటివి) తీసుకోవాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించనున్నారు. ప్రస్తుతం వికాస్ మర్మత్‌ను లూప్ లైన్ లో ఉంచారు.
వికాస్ మర్మత్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2019 బ్యాచ్ ఝూూ అధికారి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం ఆయనపై వేటు వేసింది. వికాస్ మర్మత్‌ను ఖూణాూ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ, సాధారణ పరిపాలన శాఖలో (+ూణ) రిపోర్ట్ చేయాలని అక్టోబర్ 15, 2026న ఉత్తర్వులు జారీ చేసింది.
అయితే ఈ ఐఏఎస్ అధికారి వ్యవహారం లో రాష్ట్ర ప్రజల నుండి భిన్నమైన ప్రశ్నలు తలెత్తున్నాయి.
హైద్రాబాద్,బెంగుళూరు లో గతంలో జరిగిన అనేక పబ్ ల వ్యవహారం లో సినీ ప్రముఖులు,పలువురు రాజకీయ నాయకులపై , యువతపై అనేక కేసులు నమోదు కావడం చూసాము.కానీ ఒక ఐఏఎస్ అధికారి అయ్యి ఉండి పబ్బుకు వెళ్ళడమే కాకుండా అక్కడ తనిఖీ కి వచ్చిన పోలీసులపై దురుసు ప్రవర్తన ఇంకా అనేక ఆరోపణలు వెల్లువెత్తున్న నేపథ్యం లో కేవలం ఆ అధికారిని బాధ్యతలను నుండి తప్పించి సచివాలయ ఏసీ గదుల్లో కూర్చోబెట్టడం అనేదే ఇక్కడ అసలైన సమస్య.
సాధారణంగా ఒక పేద మధ్య తరగతి వాడు మద్యం తాగితే నేరం,మద్యం మత్తులో ఏదైనా మాటలు మాట్లాడితే చట్టాలు అన్ని అప్పటికప్పుడే బైటికి వచ్చి బేడీలు వేసి వాడి బెండు తీస్తారు ఈ ఖాకీలు.ఇంకా ఒక అడుగు ముందుకు వేసి తమ విధులకు ఆటంకం కలిగించారని,అవసరమైతే దేశ ద్రోహం కేసులు కూడా బనాయించడానికి వెనుకాడని ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఉన్న ప్రజలకు దేశం మొత్తం గర్వించదగ్గ సివిల్ సర్వీస్ ఉద్యోగి అయి ఉండి తాగి వాగడమే తప్పయితే మళ్ళీ అధికార జులుం ప్రదర్శించే పని చేసి ఒక బాధ్యతాయుతమైన పోలీసు అధికారిపై చేయి చేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలు వింటుంటే ఒక సామాన్యుడికే చట్టం,ధర్మం,న్యాయం, తోటకూర పప్పు వంటివి వర్తిస్తాయా అన్న విమర్శలు ఈ ప్రభుత్వధి నేతలపై లేకపోలేదు. దేశం మొత్తం ఒకే చట్టం,ఒకే న్యాయం ఉన్నపుడు ఐఏఎస్ అధికారి కి ఒక చట్టం,సామాన్యుడు కి ఒక చట్టం అమలు చేయాలని ఎక్కడైనా ఉందా లేక బెంగుళూరు మంగుళూరు,అమరావతి,బ్రమరావతి ,
హైదరాబాద్,సైబరాబాద్ పోలీసులకు వేరు వేరు చట్టాలు ఉన్నాయా అన్న ప్రశ్న సామాన్యుడు నుండి ఉత్పన్నం అవుతోంది.లేదా ముఖ్యమంత్రి నియోజ వర్గ అధికారి కాబట్టి,అక్కడ ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాబట్టి ఇలాంటి నేరమయ సంఘటనలు ఎన్ని చేసినా పర్వలేదన్న మాట నిజం చేస్తారా అన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. లేదంటే అందరూ కూడా ఐఏఎస్ లు,ఐపీఎస్ లు చదివి అడ్డగోలు వ్యవహారాలు ,తాగి తందనాలు చేస్తే ఏమి తప్పుకాదనేది నిజం అవుతుందా అన్న ప్రశ్న ఇప్పుడిపుడే వినిపిస్తోంది.బలవంతుడు ఏమి చేసినా పర్వలేదన్న రోజులు ఉన్నంత వరకు బలహీనుడు ఈ సమాజంలో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్న వాదం వినిపిస్తోంది.ఇలాంటి ప్రజాస్వామ్య వ్యవస్థ లో ప్రజలు ఇంకా కొంత వరకు జీవించగలుగు తున్నారంటే ఈ ప్రజాస్వామ్య వాదులమని చెప్పుకునే అప్రజాస్వామ్య వాదులకు వంగి వంగి దండాలు పెట్టినా తప్పేమి కాదంటూ ఇలాంటి గొప్ప ప్రజాస్వామ్యానికి జోహార్లు చెప్పుకుంటే అంత కంటే పెద్ద తప్పు కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

## సాధారణ పరిశీలకులుగా 28 మంది ఐఏఎస్ అధికారులు

**మొదటి పేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిశీలకులకు ఆయన పలు సూచనలు చేశారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషనర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అనుసరించే విధానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పాటించాలని, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించిందని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల నిర్వహణ విధానాలు తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పరిశీలకులకు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఓటు హక్కును వినియోగించుకునే సామాన్య పౌరుల వరకు అందరికీ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని పేర్కొన్న కమిషనర్, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా స్థాయి నుంచి జోనల్ స్థాయి వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన మార్గదర్శకత్వం అందించడం, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం సాధారణ పరిశీలకుల బాధ్యత అని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

**రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు**

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని.. భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.

**ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి**

సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అనిత తదితరులు హాజరయ్యారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం



## అర్జీదారుల సంతృప్తి పెంపునకు సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలి: సీఎస్ జి. సాయి ప్రసాద్

## పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో స్పష్టత, జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు

## కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను నిబంధనల మేరకు సమర్థ వంతంగా పరిష్కరించడంతోపాటు, అర్జీదా రుల సంతృప్తి స్థాయిని పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సూచించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార విధానం, పరిష్కార అనంతరం అర్జీదారుల అభిప్రాయాల సేకరణ, ప్రజల సంతృప్తిని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**ఎండార్స్‌మెంట్లలో స్పష్టత అవసరం**

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం అనంతరం అర్జీదారుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించే ఫోన్ కాల్స్‌లో కొన్ని సందర్భాల్లో ప్రతికూల స్పందనలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారానికి సంబంధించి అధికారులు నమోదు చేసే ఎండార్స్‌మెంట్లలో స్పష్టత లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణమని పేర్కొన్నారు.ఆర్థికంగా సాధ్యం కాని అంశాలు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న వివాదాలు, సంబంధిత అధికారుల పరిధిలోకి రాని సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు తగిన అవగాహన లేకపోవడం వల్ల అర్జీల పరిష్కార స్థితిని నమోదు చేయడంలో లోపాలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనివల్ల అర్జీదారులకు తమ సమస్య పరిష్కారంపై స్పష్టత లేక అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు.ఈ సమస్యను అధిగ మించేందుకు గ్రీవెన్స్ పరిష్కార బాధ్యతలు నిర్వహించే అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అర్జీని వాస్తవంగా పరిష్కరించారా, పరిష్కరించడం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాలేమిటనే విషయాలను స్పష్టంగా పేర్కొంటూ నిబంధనలకు అనుగుణంగా ఎండార్స్‌మెంట్లు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎస్‌కు వివరించారు.

**ఎండార్స్‌మెంట్ల పరిశీలనకు ఏఐ టూల్స్ వినియోగించాలి**



అధికారులు అర్జీల పరిష్కారానికి సంబంధించి నమోదు చేస్తున్న ఎండార్స్‌మెంట్ల నాణ్యతను జిల్లా స్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక ఏఐ టూల్స్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సదుపాయం అందుబాటులో ఉంటే సమీక్షల సమయంలో లోపాలను గుర్తించి, సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడంతోపాటు అవసరమైన సవరణలు చేయించి పరిష్కార ప్రక్రియను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు.అలాగే, అర్జీల పరిష్కారానికి సంబంధించి నమోదు చేసిన ఎండార్స్‌మెంట్లను సంబంధిత అర్జీదారులకు వాట్సాప్ ద్వారా పంపించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. దీనివల్ల తమ అర్జీ ప్రస్తుత స్థితి, పరిష్కారానికి తీసుకున్న చర్యలు, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో అందుకు గల కారణాలపై అర్జీదారులకు స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. తద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు అవకాశం కలగడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని వివరించారు.

**మానవీయ దృక్పథంతో సమస్యలను పరిష్కరించాలి**

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారాన్ని కేవలం పరిపాలనా ప్రక్రియగా భావించకుండా, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వారికి తగిన సహాయం అందించే బాధ్యతగా అధికారులు గుర్తించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు.

అర్జీదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి, నిబంధనల పరిధిలో సాధ్యమైనంత మెరుగైన పరిష్కారం అందించేందుకు కృషి చేయాలన్నారు.మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అర్జీల పరిష్కారంతో సంబంధం ఉన్న అధికారులందరికీ సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అర్జీల పరిశీలన, పరిష్కార విధానాలు, స్పష్టమైన ఎండార్స్‌మెంట్ల నమోదు, అర్జీదారులతో సమర్థవంతమైన సమాచార మార్పిడిపై అధికారులకు అవగాహన కల్పించాలన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతను పెంపొందించడం, అర్జీదారుల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.

# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు

## అక్టోబర్ 22 నుంచి 24 వరకు ఎంపిక పోటీలు




మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు 2026–27లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు కృష్ణా జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (SAAP) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగా తదితర క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అర్హత కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు సంబంధిత శాఖల ద్వారా వివరాలు తెలుసుకుని ఎంపిక పోటీల్లో పాల్గొనాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కోరారు.జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులకు గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.జిల్లా స్థాయి ఎంపికల క్రీడల వివరాలుఅక్టోబర్ 22 – మొదటి రోజు- అథ్లెటిక్స్- షటిల్ బ్యాడ్మింటన్- పవర్ లిఫ్టింగ్- వెయిట్ లిఫ్టింగ్- చెస్- యోగా- టేబుల్ టెన్నిస్- క్యారమ్స్అక్టోబర్ 23 – రెండో రోజు- వాలీబాల్- బాస్కెట్‌బాల్- ఫుట్‌బాల్- లాన్ టెన్నిస్- హాకీ- క్రికెట్అక్టోబర్ 24 – మూడో రోజు- స్విమ్మింగ్- కబడ్డీ- ఖో-ఖో- రెజ్లింగ్- బెస్ట్ ఫిజిక్క్రీడలపై ఆసక్తి, ప్రతిభ కలిగిన అర్హతగల ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కృష్ణా జిల్లా అధికారులు సూచించారు.

# ఎట్టకేలకు బోనులో చిక్కిన కొండముచ్చు!



## ఎనిమిది నెలలుగా ఐదు కాలనీల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన వానరం

## మాజీ కౌన్సిలర్ బందెల థామస్ నోబెల్ చొరవతో పట్టివేత

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల ప్రజలను గత ఎనిమిది నెలలుగా భయ భ్రాంతులకు గురిచేస్తున్న కొండముచ్చు ఎట్టకేలకు గురువారం ఉదయం బోనులో చిక్కింది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విసిగిపోయిన స్థానికులకు మాజీ కౌన్సిలర్ బందెల థామస్ నోబెల్ చొరవతో ఉపశమనం లభించింది. తన సొంత ఖర్చులతో రాజమండ్రి నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి కొండముచ్చును పట్టించే ఏర్పాట్లు చేశారు.

**ఐదు కాలనీల ప్రజలకు తప్పని ఇబ్బందులు..**మచిలీపట్నం నగరంలోని 21వ వార్డు పరిధిలో ఉన్న లక్ష్మణరావుపురం, ఆదర్శనగర్, భాస్కరపురం, జనశక్తి నగర్, నోబుల్ కాలనీ, షార్కి కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కొండముచ్చు గత ఫిబ్రవరి నుంచి సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇళ్లలోకి చొరబడటం, స్థానికులను భయపెట్టడం, పశువులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.కొండముచ్చు నల్లటి ముఖం, పొడవాటి తోక, ప్రత్యేకమైన అరుపులు, దూకుడైన ప్రవర్తనతో సాధారణ కోతులను సైతం భయపెట్టి తరిమేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పశువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సంచరిస్తూ వాటిపై దాడులకు దిగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పశువులపై దాడులతో పాడి రైతులకు నష్టం..**జనశక్తి నగర్‌కు చెందిన పాడి రైతు పామర్తి శ్రీనివాస్‌కు చెందిన గేదె దూడ చెవులు, గొంతు కొరికి చంపినట్లు బాధితుడు పేర్కొంటున్నారు. మరో పాడి రైతు బోయిన సత్యనారాయణకు చెందిన ఆవులను పరుగులు పెట్టించడమే కాకుండా, పాలు పిండుతున్న సమయంలో ఆయనపైకి దూకి ముందుకాళ్లతో తన్నిందని స్థానికులు తెలిపారు. దీంతో పాలు పితకడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం..**కొండముచ్చు సమస్యపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఆశించిన స్పందన లభించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కొండముచ్చు దానంతట అదే వెళ్లిపోతుందని, దానిని రెచ్చగొట్టవద్దని కొందరు సూచించడంతో సమస్య మరింతకాలం కొనసాగిందని పేర్కొంటున్నారు..వన్యప్రాణులను స్వయంగా పట్టుకోవడం, హింసించడం చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉండటంతో అటవీశాఖ, నగరపాలక సంస్థ అధికారుల జోక్యం కోసం స్థానికులు ఎదురుచూశారు. అయితే తగిన చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**రాజమండ్రి నుంచి ప్రత్యేక బృందం రాక..**కొండముచ్చు సమస్యను తీవ్రంగా పరిగణించిన మాజీ కౌన్సిలర్ బందెల థామస్ నోబెల్ తన సొంత ఖర్చులతో రాజమండ్రి నుంచి కొండముచ్చులను పట్టుకునే ప్రత్యేక బృందాన్ని నాలుగు రోజుల క్రితం రప్పించారు. బృంద నాయకుడు సజ్జా హరి నేతృత్వంలో కొండముచ్చు తరచూ సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేక బోన్లు, వలలను ఏర్పాటు చేశారు.బోనులో ఎరగా ఉంచిన పండ్లను పలుమార్లు తిన్నప్పటికీ కొండముచ్చు చిక్కకుండా తప్పించుకుంది. చివరకు గురువారం ఉదయం ఇనుప బోనులో ఉంచిన స్వీట్‌కార్న్ మొక్కజొన్న పొత్తులను తింటున్న సమయంలో బోను తలుపు మూసుకుపోవడంతో అది బందీ అయింది. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

**సురక్షితంగా అడవిలోకి తరలిస్తాం..**ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బందెల థామస్ నోబెల్ మాట్లాడుతూ, కొండముచ్చు కూడా నోరులేని ప్రాణి అని, దానికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత అధికారుల సమన్వయంతో కొండముచ్చును సురక్షిత ప్రాంతానికి తరలించి, దాని సహజ నివాసమైన దట్టమైన అడవిలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఎనిమిది నెలలుగా భయాందోళనల మధ్య గడిపిన కాలనీవాసులు కొండముచ్చు పట్టుబడటంతో ఊరట చెందుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘనంగా వీడ్కోలు

గన్నవరం, ప్రజాభూమి, ప్రతినిధి :







భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. రెండు రోజుల పాటు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు గన్నవరం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు.ఈ సందర్భంగా విమానాశ్రయంలో రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ వీడ్కోలు పలికారు.అలాగే రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, 4(ఏ) గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రవీణ్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తదితరులు రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

# జువెలరీ పార్క్‌లో వ్యర్థజల శుద్ధి కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి

## ఏపీపీసీబీ ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య ఆదేశం

## శుద్ధి చేయని వ్యర్థజలాలను విడుదల చేస్తే కఠిన చర్యలు



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :

మచిలీపట్నం సమీపంలోని పోతేపల్లి జువెలరీ పార్క్‌లో నిర్మిస్తున్న ఉమ్మడి వ్యర్థజల శుద్ధి కేంద్రం (సీఈటీపీ) ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య ఆదేశించారు. గోల్డ్ కవరింగ్ యూనిట్ల నుంచి వెలువడే వ్యర్థజలాలను తప్పనిసరిగా కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయాలని స్పష్టం చేశారు.ఈ మేరకు విజయవాడలోని ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయంలో జువెలరీ పార్క్ ప్రతినిధులతో ఆయన సమావేశమై వ్యర్థజలాల శుద్ధి కేంద్రం ఆధునికీకరణ, ఎంవీఆర్ (MVR) సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న పనుల పురోగతి, కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.జువెలరీ పార్క్‌లోని అన్ని యూనిట్ల నుంచి వెలువడే వ్యర్థజలాలను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేయడం అత్యంత కీలకమని ఛైర్మన్ పేర్కొన్నారు. శుద్ధి కేంద్రానికి సంబంధించిన పనులను వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కేంద్రం నిరంతరం సమర్థవంతంగా పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జువెలరీ పార్క్ ప్రతినిధులు మాట్లాడుతూ, వ్యర్థజలాల శుద్ధి కేంద్రానికి సంబంధించి తమవంతుగా చేపట్టాల్సిన పనులన్నీ పూర్తయ్యాయని, కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఛైర్మన్‌కు వివరించారు.గోల్డ్ కవరింగ్ యూనిట్లలో ఉత్పత్తి ప్రక్రియ ద్వారా వెలువడే వ్యర్థజలాలను తప్పనిసరిగా ఉమ్మడి శుద్ధి కేంద్రానికి తరలించాలని డా. కృష్ణయ్య స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శుద్ధి చేయని వ్యర్థజలాలను బయటకు విడుదల చేయరాదని హెచ్చరించారు. వ్యర్థజలాల నిర్వహణలో పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పారిశ్రామిక కార్యకలాపాల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా జువెలరీ పార్క్ యాజమాన్యం, యూనిట్ల నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో విజయవాడ ప్రాంతీయ కార్యాలయ ఇంజినీర్ శ్రీనివాస్, మచిలీపట్నం జువెలరీ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మంగినపూడి బీచ్ రోడ్డులో ఘోర ప్రమాదం

## బైక్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి

మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొమ్ము ప్రేమ్ కుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.యువకుడి మృతితో అతని కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కృష్ణా జిల్లాలో మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు



## అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ.. 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు

## నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు: కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమవుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.గురువారం సాయంత్రం మచిలీపట్నంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు.

అక్టోబర్ 18 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 21 చివరి తేదీగా నిర్ణయించినట్లు, అదే రోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. అక్టోబర్ 28న పోలింగ్, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వివరించారు.నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రతి మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఎన్నికల అధికారులను నియమించినట్లు తెలిపారు. ఏ వార్డుకు ఏ అధికారి బాధ్యత వహిస్తున్నారు, నామినేషన్లు ఎక్కడ స్వీకరిస్తారు, అధికారుల కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయి అనే వివరాలను ప్రజలకు తెలియజేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలతో ప్రత్యేక పత్రికా ప్రకటనలు విడుదల చేయాలని సూచించినట్లు తెలిపారు.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు సంబంధిత ఎన్నికల నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, ప్రదేశంలోనే నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ సూచించారు.

నిర్ణీత గడువులోగా నామినేషన్లు సమర్పించాలని, అభ్యర్థులు తమ వార్డుకు సంబంధించిన ఎన్నికల అధికారి వివరాలను ముందుగానే తెలుసుకోవాలని కోరారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ, అవసరమైన ఎన్నికల సామగ్రి సమీకరణ వంటి ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.మూడు మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే. శ్రీధర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి. జయరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించండి

- రెండేళ్లలో పాలకొల్లుకు పెద్దఎత్తున నిధులు.. మరో మూడేళ్లలో మరింత అభివృద్ధి
- వైసిపి ఐదేళ్లలో అభివృద్ధి సున్నా
- విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో గత రెండేళ్లుగా రాత్రింబవళ్లు క్షణం విశ్రాంతి లేకుండా శ్రమిస్తూ పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జరిగిన అభివృద్ధిని చూసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అభివృద్ధిని చూడాలే తప్ప వ్యక్తులు, పార్టీలు, కులాలు, మతాలను చూడకూడదని సూచించారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పాలకొల్లులో అభివృద్ధి జరిగిందని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని సైతం గత ప్రభుత్వం విధ్వంసం చేసింది అన్నారు. పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. బ్రాడీపేట మంచినీటి చెరువు, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంతోపాటు 27వ వార్డు లజపతిరాయ్‌పేట, 12వ వార్డు డంపింగ్ యార్డు ప్రాంతం, 25వ వార్డు ఏవీఎస్ కాలనీ, టిడ్కో గృహాల కాలనీలో పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనించాలని, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు . సమావేశంలో కూటమి నాయకులు పాముల రజనీ కుమార్, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు, మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం చినబాబు, బోనం నాని ,తులా రామలింగేశ్వరరావు, జత్తుగా రీనా, పి .రాం బద్ర రాజు, చిలుకూరి బాలాజీ,దాసరి రత్నం రాజు, మాత రత్నరాజు, ఆరుమిల్లి చిన్ని, రుద్రరాజు సత్యనారాయణ రాజు, తాళ్ల నాగరాజు, పీతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ వ్యర్థాలతో పర్యావరణహిత ఉత్పత్తులు

-యువ పారిశ్రామికవేత్తలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రోత్సాహం



దెందులూరు

ప్రతి ఇంటికి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే.. పెదవేగి మండలానికి చెందిన ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలు రూపొందించిన పర్యావరణహిత ఉత్పత్తులను పరిశీలించారు. వరిపొట్టు, మొక్కజొన్న కాండం,పోక వ్యర్థాలతో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్లేట్లు, కప్పులు,గ్లాసులు,క్యారీ బ్యాగులు తయారు చేయడాన్ని అభినందించారు. ఈ ఉత్పత్తులు పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు రైతులకు అదనపు ఆదాయం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్,జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులతో మాట్లాడి,ప్రభుత్వ స్థలం కేటాయింపు,ఎంఎస్ఎంఈ పథకం ద్వారా రాయితీలు అందేలా తనవంతు సహకారం అందిస్తానని యువ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు.

## ప్రముఖ రైస్ మిల్లర్ వేగేశ్న రంగరాజు కన్నుమూత

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



ప్రముఖ రైస్ మిల్లర్ వేగేశ్న రంగరాజు (75) గురువారం మధ్యాహ్నం ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోనే కాకుండా జిల్లా రైస్ మిల్లింగ్ పరిశ్రమలో అగ్రగామిగా కూడా ఉన్నారు. ఆయన కేవీఎం ఛాంబర్స్ పీజీ కళాశాలకు ముఖ్య దాత గా వున్నారు. ఆయన మృతి పట్ల పాలకొల్లు రైస్ మిల్లర్లు సంతాపం వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్స్ సంఘ అధ్యక్షులు జడ్డు గాంధీ బాబు, ఉపాధ్యక్షుడు పెన్మెత్స సత్యనారాయణ రాజు (సతీష్) కార్యదర్శి వేగేశ్న రామచంద్ర రాజు (రాంబాబు )సహాయ కార్యదర్శిలు మామిడి వెంకట శ్రీరంగరాజీవ్, సహాయ కార్యదర్శి దేవరపు అజయ్ కుమార్ కోశాధికారి అద్దేపల్లి రామచంద్రరావు (చందు) తమ సంతాపం వ్యక్తం చేశారు. ఛాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి నర్సింహా రావు, వివిధ సంఘాల వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు.

## నేటి నుండి ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీలు ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీలు శుక్రవారం ఉదయం నుండి ప్రారంభమవుతాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భూన్ రాజు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ టోర్నమెంట్లో బెంగళూరు, పూణే, ముంబై, కలకత్తా, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నా నట్లు ఆయన తెలిపారు. మెయిన్ డ్రా మ్యాచులు 18వ తేదీన ప్రారంభమవుతాయని, ఇనాగరేషన్ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జల వనరుల శాఖ మాత్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొని ప్రారంభిస్తారని, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పాలకొల్లు, టౌన్ హాల్ పాలకొల్లు, ఆఫీసర్స్ క్లబ్ నరసాపురం టెన్నిస్ కోర్టులలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు బూన్ రాజు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజన మరియు,వసతి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు. ఈ టోర్నమెంట్లో 45, 55, 65, 70,, 75 వయసుల దాటిన వారు పాల్గొంటారని, డబల్స్, సింగిల్స్ రూపంలో ఈ టోర్నమెంట్లు ను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పోటీలను కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## విలీన గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు మునిసిపాలిటీలో విలీనమైనటువంటి గ్రామాలలో ఉపాధి పనులు చూపించాలని పాలకొల్లు ఎంపీడీవోకి మెమొరాండం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ రవి జిల్లా అధ్యక్షులు బి జార్జి మాట్లాడుతూ పాలకొల్లు మునిసిపాలిటీలో కలిసినటువంటి పాలకొల్లు మండలంలోని ఐదు గ్రామాలు వర్ధనం రూరల్ పంచాయతీ పూలపల్లి ఉ ల్లం పర్రు బాగ్గేశ్వరం ఎలమంచిలి మండలంలోని రెండు గ్రామాలు కొంతేర్రు అడవిపాలెం మొత్తం ఏడు గ్రామాల్లో ఉపాధి పనులు చూపించాలని పట్టణాల్లో కూడా విబిజి రాంజీ పనులు చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఎంపీడీవోకు మెమోరాండం ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు సత్యం శెట్టి పురుషోత్తం పాల్గొన్నారు.

## నేడు క్షీరా రామంలో చిన్నపిల్లలచే సామూహిక సరస్వతీ పూజలు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానమును నందు తేదీ 16. 10. 2026 శుక్రవారం రోజు మూలా నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఐదు గంటలకు చిన్నపిల్లలచే సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించబడును. దేవస్థానం వారిచే పిల్లలకు పెన్నులు పుస్తకాలు పలకలు ఉచితంగా పంచిపెట్టబడునని కార్యనిర్వహణాధికారి రాపాక శ్రీనివాసరావు మరియు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. కావున పిల్లలు పాల్గొనే విధంగా తల్లి తండ్రులను వారు కోరారు.

# అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

### టీడీపీ నాయకుల నివాళి.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కొత్తపేటలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అవుల్ పకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. ఏరోస్పేస్ ఇంజనీర్‌గా, శాస్త్రవేత్తగా దేశానికి విశేష సేవలందించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో ఎస్ఎల్వీ-3 రాకెట్ అభివృద్ధి కార్యక్రమానికి నాయకత్వం వహించి దేశ అంతరిక్ష రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. 1998లో నిర్వహించిన పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. 2002 నుంచి 2007 వరకు భారత 11వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన కలాం, ప్రజల రాష్ట్రపతిగా విశేష ఆదరణ పొందారు. దేశానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 1997లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను అందుకున్నారు. 'కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేయండి' అనే కలాం సందేశాన్ని యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, కొత్తపేట మండల టీడీపీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, కొత్తపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్, కొత్తపేట టీడీపీ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ, మండల యాదవ సంఘం అధ్యక్షుడు బయ్యే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసిత కాలనీకి వాటర్ ట్యాంక్ అందించిన కూరం సోదరులు.



ప్రజాభూమి ప్రతినిధి–బుట్టాయగూడెం.

తాగునీటి పథకం వాటర్ ట్యాంక్ లేక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు కూరం సోదరులు వాటర్ ట్యాంక్ అందించారు. మండలంలోని రెడ్డిగణపవరం గ్రామ పరిధిలో గల తెల్లవరం పోలవరం నిర్వాసిత కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణంలో ఉన్నందున కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు నుండి వచ్చే నీళ్లు స్టోరేజ్ చేయడానికి వాటర్ ట్యాంక్ సదుపాయం లేక, కరెంట్ లేనపుడు తాగునీరు సైతం కరువవుతుంది. తెల్లవరం నిర్వాసిత కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్, ఏలూరులో ఫుడ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న అతని సోదరుడు కూరం రామరాజు కలిసి 15000 రూపాయలతో 2000 లీటర్ల వాటర్ ట్యాంక్ తెల్లవరం గ్రామస్థులకు అందించారు. గ్రామస్తులు తాత్కాలికంగా దిమ్మను నిర్మించి, దానిపై కూరం సోదరులు అందించిన వాటర్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ వాటర్ ట్యాంకును గ్రామస్తులు గురువారం కూరం ప్రసాదు, రామరాజుల సమక్షంలో ప్రారంభించి, ఆ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైదా నాగరాజు, మాజీ ఎంపీటీసీ ఊకె మోహన్, గ్రామస్థులు బుచ్చిరాజు, గంగరాజు,రాయుడు, యువకులు పాల్గొన్నారు.

# ఊబలంకలో ఘనంగా రజకుల శ్రీ సత్తెమ్మ తల్లి సారీ మహోత్సవం

### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పించిన మహిళలు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట





డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో రజకుల కులదేవత శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి సారీ మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘ పెద్ద తణుకు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కులదేవతగా భావించే సత్తెమ్మ తల్లిని తమ ఆడపడుచుగా భావిస్తూ మహిళలు వివిధ రకాల పిండి వంటలు, పసుపు, కుంకుమ తదితర మంగళ వాయిద్యాలతో సారెను సమర్పించారు. అంతకుముందు గ్రామదేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో భాజా భజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం గ్రామదేవతకు పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల పిండి వంటలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెమ్మ తల్లి, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవార్లను ప్రార్థిస్తూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, కుటుంబాలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఊబలంక రజక సంఘ పెద్దలు, మహిళలు, భవానీలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదర్శమున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నా

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



నూజివీడు మంత్రిక్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు, సౌకర్యాలు కల్పించే దిశగా మొత్తం 79.71 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, కొన్ని పనులు పూర్తిఅయ్యాయని, కొన్ని పనులు ఇంకా జరుగు తున్నాయని మొత్తం 70 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. నవంబరు నెలలో మొత్తం అభివృద్ధి పనులు పూర్తిచేసి, ప్రజలు వాడుకులోకి తీసుకు వస్తామని అన్నారు. రూ 155 కోట్లతో మున్సిపాలిటీ రూపురేఖలు మార్చే అభివృద్ధి పనులకు ప్రపోజల్స్ పంపించడం జరిగిందని, నిధులు మంజూరు కాగానే నూజివీడు ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. రూ 137.00 కోట్లు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (అర్బన్ ఛాలెంజ్ ఫండ్ )(పరిపాలనా అనుమతులు ఆమోదం పొందాల్సి ఉంది) మర్రిబంధం పోలవరం కాలువ నుంచి నీటిని తరలించేందుకు సమ్మరు స్టోరేజీ ట్యాంకు మరియు పైప్‌లైను నూజివీడు పట్టణంలోనీ పెద్దచెరువు దగ్గర నిర్మాణం, రూ 18.00 కోట్లతో నూజివీడు మున్సిపాలిటీలో సీసీ డ్రైన్ల నిర్మాణంకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించి, కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించి మంచిమెజార్టీ ఇవ్వాలని కోరారు. నూజివీడు అభివృద్ధే లక్ష్యంగా ప్రతి వార్డులో ప్రజలు అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, స్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్లు, పారిశుద్ధ్యం, ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రతి వార్డులో ప్రజలు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, ప్రతి ఇంటికీ మంచినీరు,మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, అందమైన పార్కులు, మెరుగైన పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. సామాజిక వర్గాలకు అవసరమైన సదుపాయాలు, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నూజివీడును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నామని, మన మందరం కలిసి కట్టుగా పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శమున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు.

## జిల్లాలో 542 సర్పంచ్, 5,676 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

### సర్పంచ్ స్థానాల్లో మహిళలకు 266 కేటాయింపు.. వార్డు స్థానాల రిజర్వేషన్ల వివరాలు వెల్లడించిన కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఏలూరు జిల్లాలోని 542 గ్రామ పంచాయతీల సర్పంచ్, 5,676 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సర్పంచ్ స్థానాల్లో మహిళలకు 266, జనరల్ కేటగిరీకి 276 స్థానాలు కేటాయించారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని 63 పంచాయతీల్లో మహిళలకు 31, జనరల్‌కు 32 స్థానాలు కేటాయించగా, గిరిజన తండాలతో కూడిన రెండు ఎస్టీ పంచాయతీల్లో ఒకటి మహిళకు, మరొకటి జనరల్‌కు కేటాయించారు. షెడ్యూల్డ్ ప్రాంతేతర 479 పంచాయతీల్లో ఎస్టీలకు 6, ఎస్సీలకు 121, బీసీలకు 104, రిజర్వు కాని కేటగిరీకి 246 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ ప్రాంతంలోని 63 పంచాయతీల్లో 626 స్థానాలు, షెడ్యూల్డ్ ప్రాంతేతర 479 పంచాయతీల్లో 5,050 స్థానాలు ఉన్నాయి. షెడ్యూల్డ్ ప్రాంతంలోని వార్డు స్థానాల్లో మహిళలకు 313, జనరల్‌కు 313 కేటాయించారు. షెడ్యూల్డ్ ప్రాంతేతర వార్డు స్థానాల్లో ఎస్టీలకు 92, ఎస్సీలకు 1,289, బీసీలకు 1,099, రిజర్వు కాని కేటగిరీకి 2,570 స్థానాలు కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను గురువారం ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ పరిశీలించారు. ఆగిరిపల్లి జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల, ప్రధాన పాఠశాల, అడవి నెక్కలం పీఎం ఉన్నత పాఠశాలతో పాటు సింహా ద్రి అప్పారావుపేట, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశీలిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అంశా లపై దృష్టి సారించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పిం చారు. ఎన్నికల సమయంలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతియుత వాతా వరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రజలు ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించాలని ఎస్సై తెలిపారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

శుక్రవారం 16 అక్టోబరు 2026

## ఎన్నికల కోడ్ అమలులోకి.. రిజర్వేషన్లలో పారదర్శకత



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తాళ్లపూడి ఎంపీడీవో బి. అమ్మిరాజు తెలిపారు. రాజకీయ నాయకుల ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, విగ్రహాలను కప్పి ఉంచాలని, గోడలపై ఎన్నికలకు సంబంధించిన రాతలను చెరిపివేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించామని, 134 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించామని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై సందేహాలుంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు.

## క్షయ వ్యాధి నివారణకు ఉచిత ఎక్స్‌రే శిబిరం

### 70 మందికి పరీక్షలు.. ఐదుగురికి తదుపరి వైద్య పరీక్షల కోసం సిఫారసు

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ప్రధానమంత్రి క్షయ వ్యాధి రహిత భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 70 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఐదుగురిని తదుపరి నిర్ధారణ పరీక్షల కోసం నూజివీడు ప్రభుత్వ క్షయ వ్యాధి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం



ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్కలం, ఆగిరిపల్లి, సూరవరం, బొద్దనపల్లి గ్రామాలను క్షయ వ్యాధి ముప్పు అధికంగా ఉన్న గ్రామాలుగా గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ గ్రామాల్లో త్వరలో ఉచిత ఎక్స్‌రే శిబిరాలు నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు నూజివీడు ప్రాంతీయ ఆసుపత్రిలోని ప్రభుత్వ క్షయ వ్యాధి వైద్యశాలను పనిదినాల్లో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహిత, క్షయ వ్యాధి నివారణ విభాగం సిబ్బంది ఎస్టీఎస్ ఎం. జగన్మోహన్ కృష్ణ, ఎస్టీఎల్ఎస్ బొబ్బర్ల సురేష్, క్షయ వ్యాధి ఆరోగ్య సందర్శకురాలు కె. జ్యోతి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## నూజివీడు మున్సిపాలిటీకి ఇండియా కూటమి పోటీ

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మున్సిపాలిటీ అధ్యక్షస్థానానికి, 36 వార్డులకు అభ్యర్థులను నిలబెట్టాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి. గురువారం అమర్ భవంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల నాయకత్వం సమావేశం జరిపి ఈ నిర్ణయం చేశారు. గత ప్రస్తుత ప్రభుత్వాల పరిపాలనా కాలంలో నూజివీడు అభివృద్ధికి నోచుకోలేదని, అనేక సమస్యలతో నూజివీడు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ దశలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరం ఏర్పడిందని వారు పేర్కొన్నారు.



ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించడం ద్వారా మూడవ ప్రత్యామ్నాయాన్నీ నిర్మించాల్సిన ఆవశ్యకతని ప్రజల్లోకి తీసుకు వెళ్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీడీ రవికుమార్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రాజు, పట్టణ సిపిఐ (ఎం) కార్యదర్శి ఎన్ ఆర్ హనుమాన్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు పాల్గొన్నారు. నూజివీడు పట్టణ అభివృద్ధి కాముకులు, వ్యాపార వాణిజ్య వేత్తలు, అభ్యుదయవాదులు విశాల దృక్పథంతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలించి అభివృద్ధి లక్ష్యంగా పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులనుగెలిపించవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో'సామూహిక ఎలుకల నివారణ

ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా బ్రోమెడయోలిన్ మందు పంపిణీ విషపు ఎరత యారీ, వినియోగంపై రైతులకు ప్రత్యక్ష అవగాహన పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఎలుకల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి కాజులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'సామూహిక ఎలుకల నివారణ' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. పంట పొలాల్లో ఎలుకల తీవ్రతను తగ్గించేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని



ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న రైతులందరికీ ప్రభుత్వం తరఫున ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. రైతులు తమ పొలాల్లో విషపు ఎరను సులభంగా మరియు సమర్థవంతంగా ఏ విధంగా తయారు చేసుకోవాలో అధికారులు ప్రత్యక్షంగా చేసి చూపించారు.

100 గ్రాముల విషపు ఎర తయారీకి 96 గ్రాములు నూకలు 2 గ్రాములు బ్రోమోడయోలిన్ మందు,2 గ్రాములు వంట నూనె, ముందుగా 96 గ్రాముల నూకలకు 2 గ్రాముల వంట నూనెను బాగా పట్టించాలి. ఆ తర్వాత 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును చేర్చి సమంగా కలిపి 100 గ్రాముల విషపు ఎరను తయారు చేయాలి అని నేరుగా చేసి చూపించడం జరిగింది. 10 గ్రాముల చొప్పున చిన్న చిన్న పొట్లాలుగా చుట్టి, పొలాల్లోని క్రియాశీలక (ఎలుకలు తిరిగే) బొరియల వద్ద ఉంచాలని అధికారులు సూచించారు. ఎలుకల నివారణ అనేది ఒకరిద్దరు రైతులు చేస్తే పూర్తి ఫలితం ఉండదని, మండలంలోని రైతులందరూ ఒకేసారి సామూహిక ఉద్యమంగా చేపట్టినప్పుడే ఎలుకల సంతతి తగ్గి పంట నష్టాన్ని సమర్థవంతంగా నివారించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు , రైతులు ఆయా చోట్ల పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు .

## రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

### మున్సిపల్ కమిషనర్ రాజు.

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమీషన్ అధికారిక ప్రకటన మేరకు రామచంద్రపురం మున్సిపాలిటీ లోని చైర్పర్సన్ మరియు వార్డ్ సభ్యులను ఎన్నుకునేందుకు 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు మూడు రోజులు పాటు నామినేషన్లు సేకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. 32 వార్డులలో నమోదైన ఓటర్లను రాష్ట్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపాలిటీకి చైర్ పర్సన్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ద్వారా రామచంద్రపురం మున్సిపాలిటీ నందు ఎన్నికల కార్యక్రమాల వివరాలను ప్రకటించి నట్లు పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లు , మునిసిపల్ కార్యాలయం వద్ద జాబితా ప్రదర్శించడం జరిగిందని తెలిపారు

**నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ.**

16వ తేది నుండి 18.వతేది ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు మున్సిపల్ కార్యాలయం నందు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్లు ఈనెల 18 తేదీ 3 గంటల వరకూ మాత్రమే స్వీకరిస్తారని, 19తేది ఉదయం 11 గంటల తర్వాత నామినేషన్లు పరిశీలిస్తారని ఈనెల 21 తేది 3 గంటల వరకూ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించు కునేందుకు



అవకాశం ఉందన్నారు. పోటీ చేయుచున్న అభ్యర్థుల తుది జాబితా 21వ తేదీ మధ్యాహ్నం 3 గం.ల తరువాత ప్రకటిస్తారని తెలిపారు. ఈనెల 28 వ తేదీ ఉదయం 7 గం. నుండి సాయత్రం 5 గం. వరకు మున్సి పాలిటీ పరిధిలో నిర్ణయించిన 50 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసర మైన చోట్ల రీ పోలిం గ్ ఈనెల 29. ఉదయం 7 గం. నుండి సాయ త్రం 5 గం. వరకు నిర్వహిస్తారని పేర్కొ న్నారు. 30వ తేది ఉదయం 8 గం. నుండి రామచంద్రపురం లో చింతపల్లి సూరన్న మున్సిపల్ స్కూల్ నందు ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలియజేశారు.

## సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

### గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి.. రాజకీయ సమీకరణాలకు పదును.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో మొత్తం 57 గ్రామ పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్లు ప్రకటించడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి ప్రారంభమైంది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో సర్పంచ్ పదవులను ఆశిస్తున్న అభ్యర్థులు తమ రాజకీయ సమీకరణాలకు పదును పెడుతున్నారు.

**రావులపాలెం మండలంలో..**

రావులపాలెం మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దేవరపల్లి--జనరల్ మహిళ, గోపాలపురం–జనరల్ మహిళ, ఈతకోట–బీసీ, కేతరాజుపల్లి–బీసీ మహిళ, కొమరాజులంక–బీసీ మహిళ, లక్ష్మీపోలవరం–ఎస్సీ, ముమ్మిడివరప్పాడు–ఎస్సీ మహిళ, పొడగట్లపల్లి జనరల్, రావులపాడు – జనరల్, రావులపాలెం – బీసీ, ఊబలంక –జనరల్, వెదిరేశ్వరం –జనరల్ మహిళగా రిజర్వేషన్లు కేటాయించారు. ఈ 12 స్థానాల్లో మహిళలకు ఆరు స్థానాలు కేటాయించగా, మిగిలిన ఆరు స్థానాలు ఇతర కేటగిరీలకు కేటాయించారు.

**కొత్తపేట మండలంలో..**

కొత్తపేట మండలంలోని 10 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు కూడా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అవిడి –జనరల్ మహిళ, బిల్లకుర్రు –ఎస్సీ మహిళ, గంటి –ఎస్సీ, ఖండ్రిగ –ఎస్సీ, కొత్తపేట –బీసీ, మందపల్లి –జనరల్, మోడేకుర్రు –జనరల్ మహిళ, పలివెల –జనరల్, వాడపాలెం –జనరల్ మహిళ, వానపల్లి –బీసీ మహిళగా కేటాయించారు. దీంతో అవిడి, మోడేకుర్రు, వాడపాలెం స్థానాలు జనరల్ మహిళలకు, బిల్లకుర్రు ఎస్సీ మహిళకు, వానపల్లి బీసీ మహిళకు రిజర్వు అయ్యాయి. గంటి, ఖండ్రిగ ఎస్సీ, కొత్తపేట బీసీ, మందపల్లి, పలివెల జనరల్ కేటగిరీలకు కేటాయించారు.

**ఆత్రేయపురం మండలంలో..**

ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అంకంపాలెం –బీసీ మహిళ, ఆత్రేయపురం –జనరల్, బొబ్బర్లంక –ఎస్సీ మహిళ, కట్టుంగ –జనరల్ మహిళ, లొల్ల –జనరల్, మెర్లపాలెం –బీసీ మహిళ, నార్కెడిమిల్లి –జనరల్ మహిళ, పేరవరం –బీసీ, పులిదిండి –ఎస్సీ, రాజవరం –జనరల్, ర్యాలి –జనరల్ మహిళ, తాడిపూడి –ఎస్సీ మహిళ, ఉచ్చిలి –జనరల్, వాడపల్లి –జనరల్, వద్దిపర్రు –ఎస్సీ, వసంతవాడ –బీసీ, వెలిచేరు –జనరల్ మహిళగా రిజర్వేషన్లు కేటాయించారు.

**ఆలమూరు మండలంలో..**

ఆలమూరు మండలంలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు కూడా వెల్లడయ్యాయి. ఆలమూరు, మడికి, సూర్యారావుపేట గ్రామ పంచాయతీలు బీసీ కేటగిరీకి, బడుగువానిలంక, మోదుకూరు ఎస్సీ కేటగిరీకి కేటాయించారు. గుమ్మిలేరు ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. చెముడులంక, చొప్పెల్ల, జొన్నాడ, మూలస్థానం, నర్సిపూడి గ్రామ పంచాయతీలు జనరల్ మహిళా కేటగిరీకి, కలవచర్ల, నవాబుపేట, పినపళ్ల బీసీ మహిళా కేటగిరీకి కేటాయించారు. చింతలూరు, పెద్దపళ్ల, పెనికేరు, సంధిపూడి గ్రామ పంచాయతీలు జనరల్ కేటగిరీలో ఉన్నాయి. మొత్తంగా ఆలమూరు మండలంలోని 18 స్థానాల్లో తొమ్మిది స్థానాలు మహిళలకు రిజర్వు కాగా, మరో తొమ్మిది స్థానాలు ఇతర కేటగిరీలకు కేటాయించారు.

**ఆశావహుల్లో ఉత్కంఠ..**

సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏ గ్రామ పంచాయతీ ఏ కేటగిరీకి కేటాయించబడిందనే



స్పష్టత రావడంతో సర్పంచ్ పదవులను ఆశిస్తున్న నాయకులు తమ అనుచరులు, సామాజిక వర్గాలు, రాజకీయ బలాబలాలను బేరీజు వేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఆశావహులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు.

**కూటమిలో టికెట్లపై ఉత్కంఠ**

కూటమిలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా సర్పంచ్ స్థానాలపై దృష్టి సారించారు. మొత్తం 57 గ్రామ పంచాయతీల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయించాలి, ఎవరిని అభ్యర్థులుగా బరిలోకి దింపాలనే అంశంపై ఆయా పార్టీల స్థానిక నాయకులు చర్చలు ప్రారంభించారు. మరోవైపు వైసీపీ కూడా తన బలాన్ని చాటుకునేందుకు అనువైన అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఇక అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య సమన్వయం, స్థానిక రాజకీయ సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. రానున్న రోజుల్లో గ్రామాల్లో ఎన్నికల వేడి మరింత పెరిగే అవకాశం ఉంది.

## అప్రకటిత విద్యుత్ కోతలతో విసుగెత్తిపోతున్న ప్రజలు.

### –పగలు రాత్రి కరెంటు ఉండటం లేదని గగ్గోలు.

ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు

గత కొంతకాలంగా అప్రకటిత విద్యుత్ కోతలతో మండల ప్రజలు విసిగెత్తిపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా నిరంతర కోతలు కొనసాగించడంతో ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేక మోటార్లు ఆడక ఉక్కపోతతో మంచినీటి కొరకు సైతం అలమేటించాల్సిన దుస్థితి నెలకొందని వాపోవటం ప్రజలవంతయింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిరంతరంగా నిలిచిపోవడంతో ఫ్యాన్లు తిరక్క నిద్ర లేక నిరసించి పలు వ్యాధులు బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇంత దారుణమైన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని,ఈ పరిస్థితికి కారణం ఏమిటన్నది చెప్పే పరిస్థితిలో విద్యుత్ శాఖ సిబ్బంది లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ప్రభుత్వం సరఫరా చేయలేక కోతలు విధిస్తుందా! లేక ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్య ధోరణి కారణమా! అన్న ప్రశ్నలు మండలంలో కోకోలలుగా తలెత్తుతున్నాయి. ఏది ఏమైనా అసలే మండు టెండలు ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలను ఈ విధమైన అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులకు గురి చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు.

## ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల్లో వామపక్షాల పోటీ



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

నెల 28న జరగనున్న ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం పార్టీలు తొమ్మిది డివిజన్లలో పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించాయి. గురువారం సాయంత్రం సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన ఇరు పార్టీల నాయకుల సంయుక్త సమావేశం జరిగింది. ఇందులో సీపీఐ ఆరు డివిజన్లలో, సీపీఎం మూడు డివిజన్లలో పోటీ చేసే అంశంపై ప్రాథమికంగా నిర్ణయించారు. బీజేపీ వ్యతిరేక పార్టీలను కలుపుకొని ఎన్నికల్లో వామపక్షాల బలాన్ని పెంచుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు,బండి వెంకటేశ్వరరావు, డి.ఎన్.వి.డి. ప్రసాద్, ఉప్పులూరి హేమశంకర్, రెడ్డి శ్రీనివాస్ డాంగే,పంపన రవికుమార్,కూరేళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

## ఏలూరు జనసేనలోకి 20 మంది చేరిక



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జనసేన పార్టీలో చేరికలు జరిగాయి. గొల్లాయిగూడెం ప్రాంతానికి చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 20 మంది గురువారం జనసేనలో చేరారు. వారికి ఆర్టీసీ విజయవాడ జోన్–2 చైర్మన్,జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన సిద్ధాంతాలు,పవన్ కళ్యాణ్ ఆశయాలు,ప్రజా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వీరంకి పండు, దోనేపూడి లోవరాజు, కస్తూరి సాయి తేజస్విని, ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా,జనసేన నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి పార్టీలో భారీ చేరికలు




ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి క్యాంపు కార్యాలయంలో ముసునూరు మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు పార్టీ కండువా కప్పుకుని తెలుగుదేశం పార్టీలో చేరారు. మంత్రి ప్రతి ఒక్కరికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ యొక్క సిద్ధాంతాలు పార్టీ యొక్క ఆలోచనలు పార్టీ యొక్క నాయకత్వ లక్షణాలను చూచి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పలువురు తెలియజేశారు. దూర దృష్టి రాజకీయ నేతజ్ఞుడు పరిపాలనాధకుడు అయిన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ మరియు ఆయన చేసిన అభివృద్ధి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తెలుగుదేశం వెంట నడవవలసిన సమయం అసన్నమైనదని వారి యొక్క మనోభావాలు తెలియజేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలగాలన్న అది కేవలం ఒక్క నారా చంద్రబాబు నాయుడు వల్ల సాధ్యమని పలువురు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో సిహెచ్ శ్రీనివాస్ రావు, జి,శ్రీనివాస్, సిహెచ్ మణికంఠ, సుబ్బారావు, పి రోహిత్, విశ్వనాథం, దత్తు, అశోక్ కుమార్, టి, కిషోర్, విగ్నేశ్వరరావు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గద్దె రఘు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో మార్పులకు గడువు పొడిగింపు

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి



ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలకు ఎన్నికల కమిషన్ గడువు పొడిగించినట్లు తాళ్లపూడి ఎంపీడీవో అమ్మిరాజు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు సవరణలకు అవకాశం కల్పించారని, అనంతరం అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శుక్రవారం 16 అక్టోబరు 2026

# అధికారుల నిర్లక్ష్యంతో అభ్యర్థులకు ఇబ్బందులు

**-కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి -మున్సిపల్ కార్యాలయంలోనూ సర్వర్ సమస్యలతో అవస్థలు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తక్షణమే అందించాలని వైకాపా రాష్ట్ర కురుబ సంఘం కార్యనిర్వహణ అధ్యక్షులు శివ డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాలకు వస్తున్న అభ్యర్థులకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూపురం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ఆయనకు సంబంధిత అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎంతో అవసరమని తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన కీలక సమయంలోనూ తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలైనా అధికారులు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సరైన సమాచారం, స్పందన అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోనూ ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించేందుకు వెళ్లినప్పుడు సర్వర్ పనిచేయడం లేదనే కారణంతో పనులు నిలిచిపోతున్నాయని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించి ప్రజలకు, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని శివ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆసిఫ్, మహేష్, కట్ల భాష, లోకేష్, అయూబ్ బేగ్, జబీవుల్లా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

**వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆమోదిస్తాం- తహసీల్దార్ వెంకటేశు**

ఎన్నికల విధులతోపాటు ఇతర ప్రభుత్వ విధుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను వెంటనే పరిశీలించి ఆమోదం తెలుపుతున్నామని తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాల కోసం అభ్యర్థులు నేరుగా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ఆయా సచివాలయాలు లేదా మీ సేవా కేంద్రాల ద్వారా తగిన ఆధారాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత మేరకు ఆమోదం తెలుపుతున్నామని వివరించారు.

# వీరశైవులకు చైర్మన్ టికెట్ కేటాయించాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వీరశైవ సంఘం తరపున టీ.ఎస్. ప్రభుకుమార్‌కు అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వీరశైవ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌శ్రీనివాసరావును కలిసి తమ అభ్యర్థనను వివరించారు. ఈ సందర్భంగా వీరశైవ సంఘం నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తమ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు. సంఘం తరపున టీ.ఎస్. ప్రభు కుమార్‌కు అవకాశం కల్పిస్తే వీరశైవ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి, తమ అభ్యర్థనను పరిశీలించేలా చూడాలని శ్రీనివాసరావును కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని, తమ సంఘం అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వీరశైవ సంఘం నాయకులు అందజేసిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్తామని శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు టీ.ఎస్. ప్రభు కుమార్‌తో పాటు సంపత్ కుమార్, మల్లికార్జున, మంజునాథ్, ఉమేష్, లోకేష్, వీరభద్రప్ప, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన గాండ్ల రాము

**గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక**



ప్రజా భూమి నార్పల

గాండ్ల రాము భారతీయ జనతా పార్టీలో చేరడంతో పాటు గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. బీజేపీ కిసాన్ మోర్చా అనంతపురం జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో గాండ్ల రాము పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాండ్ల రాము చేరికతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూల రాజేష్, నార్పల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, నాగేంద్ర, అకులప్ప, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శించుకున్న: ఎంపీ అంబిక

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



తిరుమల బ్రహ్మోత్సవాల శుభవేళ అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గురువారం దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు ఎంపీ అంబిక. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించాను.

# కలాం గొప్ప దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత

**- నిరాడంబరత, మానవీయ విలువలు స్ఫూర్తిదాయకం**

**- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత, క్షిపణి పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శి అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. గురువారం స్థానిక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ.. స్వయంకృషి, స్వీయ ప్రతిభతో రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు కలాం ఎదిగారని తెలిపారు. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అనే ఆయన సందేశం ప్రపంచవ్యాప్తంగా యువతకు స్ఫూర్తినిచ్చిందన్నారు. రక్షణ, అంతరిక్ష, వైద్య రంగాలతో పాటు మానవాళి అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అగ్ని, పృథ్వి క్షిపణుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కలాం గొప్ప శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారని తెలిపారు. నిరంతర విద్యార్థిగా కొనసాగిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన నిరాడంబరత, మానవీయ విలువలు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, ధ్రువకుమార్ రెడ్డి, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు హ్యాండ్ బుక్ లో మార్గదర్శకాల మేరకు సజావుగా నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ జరిగేలా ఆర్ఓ, ఎఆర్వోలు క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి

**- : జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..**



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అక్టోబర్ 14న మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలపై షెడ్యూల్ విడుదల అయిందని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినదని, ఎన్నికల ప్రక్రియను నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో నిష్పక్ష పాతంగా చేపట్టాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని జిల్లా పరిషత్ డిపిఆర్సి సమావేశ మందిరంలో జిల్లా పరిషత్, మండల ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించి ఆర్ఓ, ఎఆర్ఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ సాధారణ ఎన్నికలు ఎంపిటిసి, జడ్పీటీసీ - 2026కి సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు మాత్రమే ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, సొంతంగా నిర్ణయాలు, ఊహలకు తావు ఇవ్వరాదని ఆర్ఓ, ఎఆర్ఓలను ఉద్దేశించి అన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలు, రూల్‌బుక్‌ను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఎన్నికలు చట్టబద్ధమైన ప్రక్రియ కాబట్టి అధికారులు తమ వ్యక్తిగత అభిప్రాయాలు, సాధారణ అవగాహన లేదా గత ఎన్నికల అనుభవాల ఆధారంగా కొత్త విధానాలు అమలు చేయకూడదని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని సంబంధిత రూల్‌బుక్, సర్క్యులర్లు, అధికారిక మార్గదర్శకాల ప్రకారం మాత్రమే నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో భాగంగా అధికారులు ముందుగా రూల్‌బుక్‌ను పూర్తిగా చదివి, సందేహాలు వచ్చినప్పుడు అందులోని సూచనలు పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి రిటర్నింగ్ అధికారి తన పరిధిలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, తుది బాధ్యత కూడా సంబంధిత అధికారిదేనని పేర్కొన్నారు. మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒకే అధికారికి ఒకేసారి రెండు లేదా అంతకంటే ఎక్కువ బాధ్యతలు కేటాయించబడితే, ఒకే రోజున రెండు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటే చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఉత్తర్వులు జారీ చేసి విధుల పునర్విభజన చేస్తామని వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు అందరూ పని చేయాలని, చాలా మంది ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉంటారని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికలపై అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సిఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమింపబడిన అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఉప్పర్లకు 5 శాతం సీట్లు కేటాయించాలి

**-చంద్రబాబు, బాలకృష్ణకు విజ్ఞప్తి**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

త్వరలో జరగనున్న హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో ఉప్పర సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఉప్పర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ సామాజిక వర్గానికి 5 శాతం సీట్లు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఉప్పర సంఘం నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉప్పర సామాజిక వర్గం గణనీయమైన జనాభాను కలిగి ఉందని, అయినప్పటికీ రాజకీయ రంగంలో ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉప్పర సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో తమ సంఘానికి 5 శాతం సీట్లు కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో అన్ని సామాజిక వర్గాలకు భాగస్వామ్యం కల్పించినప్పుడే ఆయా వర్గాల సమస్యలు, అవసరాలు ప్రజాప్రతినిధుల ద్వారా పాలకుల దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తమ సామాజిక వర్గానికి సముచిత గుర్తింపు కల్పించి, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తగిన అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తమ విజ్ఞప్తిని పరిశీలించి న్యాయం చేయాలని ఉప్పర సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకత్వం తమ అభ్యర్థనను సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వివిధ సామాజిక వర్గాలు తమకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్న తరుణంలో ఉప్పర సంఘం నాయకులు సైతం తమ డిమాండ్‌ను ముందుకు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తమ సామాజిక వర్గానికి ఎన్ని సీట్లు కేటాయిస్తారు, పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశాలపై సంఘం నాయకులు ఎదురుచూస్తున్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉప్పర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, పవన్, జిల్లా ఉపాధ్యక్షులు బాల గోవిందు, నాయకులు వెంకట్, ఆదినారాయణ, మోహన్, కృష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ -14 కౌంటర్ల ఏర్పాటు

**-ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ -మున్సిపల్ ఎన్నికల అధికారి మల్లికార్జున**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుందని మున్సిపల్ ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ నామినేషన్లను సంబంధిత కౌంటర్లలో సమర్పించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని మల్లికార్జున వివరించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణకు మొత్తం 14 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా వార్డులకు కేటాయించిన కౌంటర్లలోనే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. ఎంజీఎం పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి సంబంధించిన కౌంటర్‌తో పాటు ఒకటో వార్డు నుంచి 20వ వార్డు వరకు నామినేషన్ల స్వీకరణకు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 21వ వార్డు నుంచి 24వ వార్డు వరకు ఒక డీఈ ఛాంబర్‌లో, 25వ వార్డు నుంచి 28వ వార్డు వరకు మరో డీఈ ఛాంబర్‌లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 29వ వార్డు నుంచి 32వ వార్డు వరకు మెప్మా విభాగంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 33వ వార్డు నుంచి 52వ వార్డు వరకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఐదు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ వార్డుకు కేటాయించిన కౌంటర్‌ను ముందుగానే తెలుసుకొని, నిర్ణీత సమయంలో నామినేషన్లను సమర్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని మల్లికార్జున తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ పత్రాలతో పాటు అవసరమైన వివరాలు, సంబంధిత ధ్రువ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ముందుగానే నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఎన్నికల అధికారి కోరారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం: టీడీపీ నేతలు

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ



భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురువారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సాధారణ కుటుంబంలో జన్మించి, తన ప్రతిభ, కృషి, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భారతదేశాన్ని శాస్త్రసాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కలాం చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ముఖ్యంగా యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఆయన ఇచ్చిన సందేశం నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చైర్మన్ అభ్యర్థి వైయస్ ప్రమీలమ్మ గెలుపు ఎవరు ఆపలేరు

## అన్ని విధాల మేము సిద్ధంగా ఉన్నాం

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల




పులివెందుల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో స్థానిక రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. ప్రమీలమ్మ అభ్యర్థిత్వంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని వైకాపా నాయకులు పేర్కొంటున్నారు.పులివెందుల మున్సి పాలిటీ పరిధిలో గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో ఉన్న అనుబంధం, పార్టీ శ్రేణుల సమష్టి కృషి ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగ కోశాధికారి యాగంటి రాఘవేంద్రారెడ్డి లు అన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూవైఎస్ ప్రమీలమ్మ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వారుపేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి నమ్మకాన్ని పొందుతూ ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్ ప్రమీలమ్మ అభ్యర్థిత్వం ప్రాధాన్యత సంతరించుకుందని, రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుందని వారు తెలిపారు. కూటమి నాయకులు ఎన్ని కుట్రలు పన్నిన ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ని గెలిపించేందుకు ప్రజలు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

# శ్రీ వనవిహారిణి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఐదవ రోజు సందర్భంగా అమ్మవారు శ్రీ వనవిహారిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, జపాలు, చండీ పారాయణం నిర్వహించి మహా నివేదన, మహా మంగళహారతి సమర్పించారు. రాత్రి అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

# డిగ్రీ ప్రవేశాలకు మూడో విడత షెడ్యూల్ విడుదల

## - ఈ నెల 24 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్లు

## - ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ

ప్రజాభూమి, వేంపల్లె



2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల మూడో విడత షెడ్యూల్‌ను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమిషనరేట్ విడుదల చేసిందని స్థానిక పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 24 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్లు, 25 నుంచి 27 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. అక్టోబర్ 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 28న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 30న సీట్ల కేటాయింపు జరగనుండగా, అదే తేదీ నుంచి నవంబర్ 2 వరకు విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ హిస్టరీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశం పొందని విద్యార్థులు, స్లైడింగ్ కోరుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491947599, 9492411181 నంబర్లను సంప్రదించాలని లేదా కళాశాలను నేరుగా సంప్రదించాలని ఆమె కోరారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ జగన్‌కు బిగ్ షాక్

## - వైకాపా నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ వేడి రాజుకుంది. 8వ వార్డుకు చెందిన వైకాపా నేతలు భారీగా టీడీపీలో చేరడంతో జగన్‌కు బిగ్ షాక్ తగిలినట్లయింది. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ప్రాంతం 8వ వార్డుకు చెందిన కొమ్మెర విజయ్, కొమ్మెర వినోద్, దేరంగుల ఈశ్వర్ తో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెనుగొండ చిన్న తరుణ్ ఆర్ 15 చిన్న), తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 20 కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరారు. వారికి పులివెందుల టీడీపీ ఇంఛార్జ్ బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ.నోటిఫికేషన్ విడుదలైన తర్వాత టీడీపీకి ప్రజల నుంచి వస్తున్న స్పందనకు ఈ చేరికలే నిదర్శనమన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పులివెందుల పట్టణ అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ ఆ హజ్ డైరెక్టర్ మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు సిద్ధం

## పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ధ్రువ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖాదరవల్లి , మండల అధ్యక్షుడు శివ కళ్యాణ్ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయపాటి రాజా,లు అన్నారు. ఈ సందర్భంగా పులివెందుల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పేర్లు, దేవత వెంకటాంజలి, బూచుపాటి విజయ, పెండ్లూరు అనూష పేర్లను అధిష్టాననికి పంపించడం జరిగింది అన్నారు. వీరిలో అధిష్టానం ఎవరి పేరు ఖరారు చేస్తే వారు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే వార్డులలో కౌన్సిలర్లను కూడా నిలబెట్టేందుకు సిద్ధంగా ఉండామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలోనేపులివెందుల అభివృద్ధి చెందిందని వారన్నారు. వైకాపా పార్టీ, టిడిపి పార్టీలో పులివెందుల అభివృద్ధి చెందింది శూన్యమన్నారు. వైకాపా, టిడిపి పార్టీలోనే అన్నారు. పులివెందుల ప్రజలు చైర్మన్ అభ్యర్థికి, కౌన్సిలర్ అభ్యర్థికి రెండు ఓట్లు హస్తంగుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పులివెందుల మళ్లీ అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలి

## ప్రభుత్వ భూమిని కాపాడడంలో అధికారులు మౌనం వహించడం పట్ల కారణం ఏమిటి

## అధికారుల తీరుపై రాధా ఆగ్రహం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని మైత్రి లేఔట్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించు కోవడం లేదని ఎం. రాధా ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తన ఆవేదనను వ్యక్తం చేశారు.మైత్రి లేఔట్ పరిధి లోని సర్వే నంబర్లు 378/2,380/2, 381/1లో ఉన్న 22సెంట్ల ప్రభుత్వ భూమిని రక్షించాలని, ఆ భూమిని తనదిగాపేర్కొంటూ షేక్ జిలాన్ భాష గోడ నిర్మిస్తున్నారని ఆరోపించారు. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు 2026 జూన్‌లో అక్కడ నిర్మించిన గోడను తొలగించారని, ప్రస్తుతం మళ్లీ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని వేడుకున్న అధికారులు పట్టించుకోకపోవడం కారణం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని రాధా విమర్శించారు. సంబంధిత భూమి పత్రాలను పరిశీలించి, అక్రమ నిర్మాణం జరుగుతుంటే తక్షణమే అడ్డుకోవాలని, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని అధికారులను కోరారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

# వేంపల్లిలో సేవా సంకల్ప్ అభియాన్

## - వివిధ ఆరోగ్య సేవలు.. జన్యుపరమైన వ్యాధులపై అవగాహన



ప్రజాభూమి, వేంపల్లె

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అక్టోబర్ 15న 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ, శిశు ఆరోగ్య సేవలు, టీకాలు, పోషకాహారం, కంటి, చెవి, ముక్కు, గొంతు, దంత, వృద్ధుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధుల గుర్తింపు పరీక్షలతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు. డీబీటీ--ఉమ్మీద్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ రక్తహీనత, నవజాత శిశువుల్లో జీవక్రియ సంబంధిత రుగ్మతలను ముందస్తుగా గుర్తించేందుకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు పాల్గొన్నారు. వైద్యాధికారి డా. జోయెల్ వెస్లీ, స్త్రీ వైద్య నిపుణులు డా. ప్రెసిల్లా, డా. శుభాషిణి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో కుళ్లాయమ్మ హాజరయ్యారు. కడప జిల్లా డీసీహెచ్ఎస్ డా. హిమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. యుగంధర్, బాల ఆరోగ్య కార్యక్రమ అధికారి డా. ఆరిఫ్ సహకారం అందించారు. ప్రాజెక్టు బృంద సభ్యులు షహీనా, సయ్యద్ బాషా, షేక్ ఆరిఫ్, రంజిత, భరత్ సహకరించారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, జన్యుపరమైన, వంశపారంపర్య వ్యాధులపై అవగాహన కల్పించడం, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

## - సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి- వైద్యాధికారి డా. పూర్వజ

ప్రజాభూమి, వేంపల్లె




ప్రజలు ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాళ్లపల్లె వైద్యాధికారి డాక్టర్ పూర్వజ సూచించారు. గురువారం వేంపల్లెలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డే గా పాటించాలని సూచించారు. ఇళ్లలోని నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి, శుభ్రంగా కడిగి ఎండబెట్టడం ద్వారా దోమల గుడ్లు, లార్వా వృద్ధిని అరికట్టవచ్చన్నారు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కుండలు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కూలర్లు, నీటి తొట్లను వారానికోసారి శుభ్రపరిచి ఎండబెట్టాలని సూచించారు. అనంతరం సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ, దోమల నుంచి రక్షణ కోసం దోమతెరలు ఉపయోగించాలని, సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని సూచించారు. అలాగే ఆరోగ్య విస్తరణ అధికారి ఫకృద్దీన్ మాట్లాడుతూ, దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ పూర్వజ సూచించారు. పరిసరాల పరిశుభ్రతలో ఆరోగ్య శాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంకయ్య, అరుణాదేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తాం: డాక్టర్ బ్రాహ్మణి

ప్రజాభూమి, సిద్ధవటం: నిరుపేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిద్ధవటం దిగువపేట గాంధీ వీధిలో గురువారం నూతనంగా వైష్ణవి వైద్యశాలను ప్రారంభించినట్లు డాక్టర్ పి. బ్రాహ్మణి తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలతో రోగుల వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స అందిస్తామన్నా రు. వైద్య శాలలో డాక్టర్ నాగేంద్ర (ఎండీ), డాక్టర్ ఉపేంద్ర (ఫార్మసీ) అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఆస్తమా, కామెర్లు, కొలెస్ట్రాల్, కీళ్ల నొప్పులు, రుమటాలజీ తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. గర్భిణులకు అవసరమైన ఆరోగ్య సూచనలు ఇవ్వడంతో పాటు, వ్యాధిని బట్టి రక్త నమూనాలు సేకరించి పరీక్షల ఆధారంగా వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ బ్రాహ్మణి వివరించారు.



# పశువుల పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## – గాలికుంట్ల వ్యాధి నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాభూమి, సిద్ధవటం: పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భాకరాపేట గ్రామ పశు వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పశువుల పాకలను నిత్యం శుభ్రంగా ఉంచడంతో పాటు, పశువులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని తెలిపారు. పాడి గేదెలకు గాలికుంట్ల వ్యాధి సోకకుండా నవంబర్ నెల నుంచి వ్యాక్సిన్ అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ పశువులకు సకాలంలో టీకాలు వేయించి వ్యాధుల నుంచి రక్షించుకోవాలని సూచించారు. చెరువులు, కుంటల్లోని కలుషిత నీటిని పశువులు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల పాకల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పాడి పశువుల ఆరోగ్యంపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఎల్లవేళలా అందించేందుకు పశువైద్యశాఖ సిద్ధంగా ఉంటుందని డాక్టర్ శివశంకర్ వెల్లడించారు.

# శ్రీ వనవిహారిణి దేవిగా శ్రీ వాసవి మాత దర్శనం

## - శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని 122 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, పాలకవర్గం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకం, నివేదన, మంత్రపుష్పం, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ వాసవి మాతను శ్రీ వనవిహారిణి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కల్యాణ మండపం ఆవరణలో నెల్లూరుకు చెందిన మహాలక్ష్మి ఈవెంట్స్ బృందం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి - ప్రజలను కోరిన వైఎస్ ప్రమీలమ్మ

## గత ప్రభుత్వంలోనే మున్సిపాలిటీ అభివృద్ధి

## - కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి వైకాపా అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో మాజీ చైర్ పర్సన్ రుక్మిణితో కలిసి ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే పులివెందుల మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కూటమి ప్రభుత్వం వచ్చి మూడేళ్లవుతున్నా ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని విమర్శించారు. వీధి దీపాలు కొనడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందన్నారు.ఓటర్లు ఎవరికీ భయపడకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో మాజీ చైర్మన్ రసూల్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ భార్గవి, అంకాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ ప్రసాద్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లలితా త్రిపురసుందరి దేవిగా చౌడేశ్వరి దేవి

ప్రజాభూమి,పులివెందుల



దశరా శరన్నవరాత్రుల మహోత్సవములు సందర్భముగా పులివెందుల లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి గురువారం ఉదయం ప్రత్యేక అభిషేకములు కుంకుమార్చనలు పూజలు నిర్వహించారు. సాయంకా లంలలితా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్,ఆలయ అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి వారు మాట్లాడుతూ దశరా ఉత్సవాలు ప్రతి సంవత్సరము అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని వారి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 16 అక్టోబరు 2026

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తిరుపతి జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధం

### నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

### నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు- జిల్లా ఎస్ పి ఎల్. సుబ్బరాయుడు

ప్రజా భూమి ప్రతినిధి,లితిరుపతి,

జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వి సి హాల్ నందు ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జేసి ఆర్.గోవిందరావు, డిఆర్ఓ జి.నరసింహులు లతో కలసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఎన్నికల సామగ్రి, భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర మౌలిక సదుపాయాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం తొలుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వెంకటగిరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల ఎన్నికలకు ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు, వార్డు సభ్యుల పదవులకు వేర్వేరుగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా, గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తదనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలు, వార్డులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు రిజర్వేషన్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల జనాభా గణాంకాలు, రిజర్వేషన్ నిబంధనలు, రొటేషన్ విధానాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత నామినేషన్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, నిర్ణీత సమయంలోగా హాజరుకావాలని




సూచించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వచ్చే నామినేషన్లను స్వీకరించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద బారికేడ్లు, వాహనాల నియంత్రణ, అభ్యర్థులు మరియు ప్రతిపాదకుల ప్రవేశానికి సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపసంహరణ అనంతరం అదే రోజు సాయంత్రం పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు తదితర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే అధికారులు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు లేదా ఇతరులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే శిక్షణ అందించామని, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి రానున్న వారంలో సమగ్ర శిక్షణతో పాటు ప్రాయోగిక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీసు యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్, జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఎన్నికల విధులతో పాటు ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లా పోలీసు అధికారి, ఇతర ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ గత పది రోజులుగా ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలకు సంబంధించి జిల్లా పోలీసు అధికారి తదుపరి వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

ఎస్పి ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ఏర్పాటు చేసిన ఎంసీసీ బృందాలు, సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఇప్పటికే విధుల్లోకి పంపామన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పూర్తి చేస్తూ, సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగించి భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియతో పాటు ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రీ-పోల్ బందోబస్తు, పోలీసు బలగాల పంపిణీ, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారుల భద్రత, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలను నిరంతరం సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజున ప్రతి పోలింగ్ కేంద్రం, పోలింగ్ బూత్ పరిసరాల్లో అవసరమైన మేరకు పోలీసు బలగాలను మోహరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డిస్పాచ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రవాణా మార్గాలు, రూట్ మొబైల్స్‌కు సంబంధించి కూడా తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు పోలీసు శాఖ అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతోందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు, ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని ఎస్ పి తెలిపారు.

## భక్తుల సేవలో.. కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ..

### - కమాండ్ కంట్రోల్ కేంద్రంతో పాటు క్షేత్రస్థాయిలో సుడిగాలి తనిఖీలు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: దసరా ఉత్సవాల్లో 5వరోజు -జగన్మాత శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శన మిస్తుండగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతుంది. అన్ని క్యూ లైన్లలో భక్తులు తరలివెళ్తూ అమ్మ దర్శనం చేసుకుంటు న్నారు. మరోవైపు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో క్యూలైన్లను పరిశీలిస్తుండటంతో పాటు కొండ దిగువున గల సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. రద్దీ నియంత్రణ, వీవీఐపీ, వీఐపీ వాహనాల రాకపోకలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, శాంతిభద్రతల పరిరక్షణ.. ఇలా ప్రతి విషయంలోనూ సీసీసీ ఉత్సవాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీటీవీలు, డ్రోన్ల విజువల్స్‌ను నిరంతరం పరిశీలిస్తూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాల విజయవంతానికి సీసీసీ సిబ్బంది కృషిచేస్తున్నారు. ఆధునిక కెమెరాల డేటాను కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌ను నిశితంగా పరిశీలిస్తూ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా, నిబంధనల ఉల్లంఘనల జరక్కుండా చూస్తున్నారు.

## ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు - శ్రీ అన్నపూర్ణాదేవి ఆరాధన



ప్రజాభూమి ప్రతినిధి రామచంద్రపురం

లోకకల్యాణం, సకల జీవుల సంక్షేమమే లక్ష్యంగా పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి మార్గదర్శకత్వంలో ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగవ రోజు శ్రీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అమ్మవారు అన్నదానానికి, ఆహార సమృద్ధికి, సమస్త జీవకోటికి పోషణను అందించే దివ్యశక్తికి ప్రతీకగా భక్తులచే ఆరాధించబడతారు. అమ్మవారి కృపతో ప్రతి ఇంటా అన్నపూర్ణత వెల్లివిరియాలని, ఎవ్వరూ ఆకలితో అలమటించకూడదని, సమాజంలో దానధర్మాలు, సేవాభావం మరింత పెంపొందాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ ధనధాన్య



సమృద్ధి కలగాలని, సమస్త జీవరాశికి ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని అమ్మవారిని ప్రార్థించారు. పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి ప్రేరణతో ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం, గోసంరక్షణ, పేదలకు సేవ వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అన్నదానం అనేది కేవలం ఆకలి తీర్చే కార్యక్రమం మాత్రమే కాకుండా, మానవత్వాన్ని చాటే పవిత్రమైన సేవ అని ఫౌండేషన్ విశ్వసిస్తోంది. దసరా మహోత్సవాల ద్వారా ప్రజల్లో భక్తిభావం, ధర్మాచరణ, సేవాతత్పరత పెంపొందించడంతో పాటు సమస్త లోకానికి శాంతి, సుఖసంతోషాలు, ఆరోగ్యం, సుభిక్షం చేకూరాలని ఆకాంక్షిస్తున్నారు.

## దిగువమాఘంలో రాజన్న హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ.

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిగువమాఘంలో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాజన్న హెల్త్ సెంటర్‌కు గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం రాజన్న ఫౌండేషన్ చైర్మన్, మరియు అమర్ రాజా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డా. గల్లా రామచంద్ర నాయుడు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, “ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరూ వైద్య సేవలకు దూరం కాకూడదన్నదే రాజన్న ఫౌండేషన్ లక్ష్యం. ఈ హెల్త్ సెంటర్ ద్వారా దిగువమాఘం, పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నాం. ఇందులో ఉచిత ప్రాథమిక వైద్య సేవలు, ఉచిత క్లినికల్ ల్యాబ్, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సేవలు అందించడానికి నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళల ఆరోగ్య అవసరాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తాం. అంతేకాకుండా, నెలకు రెండుసార్లు అమరా హాస్పిటల్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు అందిస్తారు. తద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలను స్థానికంగానే చేరువ చేయడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయగలుగుతాం” అని తెలిపారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయి వైద్య సేవలు ప్రారంభమైన తర్వాత దిగువమాఘం, పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఈ కేంద్రం దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్, మాజీ సర్పంచులు కుమార్ నాయుడు, పరంధామ నాయుడు, గోపి మరియు సమీప గ్రామస్తులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహణకు ప్రజలు సహకరించాలి

### రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ను బైండోవర్ చేస్తాం.

### నామినేషన్ల స్వీకరణ కేంద్రం, సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తాం.

### ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు - ఎస్సై భక్తవత్సలం.

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం.

మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు రాజకీయ నాయకులు సహకరించాలని ఎస్సై భక్తవత్సలం కోరారు. గురువారం ఆర్సీపురం రక్షకభట్ట నిలయంలో ఎన్నికల నిర్వహణపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలన్నారు. మండలంలో జడ్పిటిసి, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధన అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 5 పోలింగ్ కేంద్రాలను సమ్మసాత్మకంగానూ, 4 పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించమన్నారు, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డి.ఎస్.పి జగదీష్ నాయక్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తుగా రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ను బైండోవర్ చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఓటరు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అన్నారు.

ఎన్నికల కోడ్ లో చేయకూడనివి పనులు ఫ్లెక్సీలు,, వాల్ రాతలు:



ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, వాల్ రాతలు ఉండరాదు.

ప్రలోభాలు: ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంచడం లేదా ఉచితంగా వస్తువుల పంపిణీ చేయడం తీవ్ర నేరం.

ప్రభుత్వ వనరులు: ప్రభుత్వ వాహనాలు, నిధులు, భవనాలను,ప్రభుత్వ పథకాల ప్రచారాలను ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు.

కొత్త పథకాలు/పనులు: ఓటర్లను ఆకట్టుకునేలా కొత్త ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు లేదా కొత్త నిధుల మంజూరు చేయకూడదు.

అనుమతి లేని మైకులు: రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడకూడదు. పగటిపూట కూడా ముందస్తు పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రజలు సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ. 50,000 కంటే ఎక్కువ నగదును రవాణా చేయకూడదని ప్రజలకు సూచించారు.

## శ్రీ తారా దేవి అలంకరణలో శ్రీ మరకత కాళిదేవి దర్శనం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

రామచంద్రాపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు గురువారం శ్రీ దశమహా విద్యా దేవతల దివ్యోత్సవములు, నాల్గవ రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. శ్రీ తారా దేవి కి విశేష పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం శ్రీ మరకత శక్తికాళీ దేవికి శ్రీ తారా దేవి రూప అలంకరణలో ,



విశిష్ట పూజ, హోమము, పూర్ణాహుతి నిర్వహించారు. స్త్రీమూర్తులకు సువాసిని పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని గురువుల, దేవతల అనుగ్రహమును పొందారు. అందరికీ అన్న ప్రసాద వితరణ చేయడము జరిగినది. బొప్పూడి కృష్ణమోహన్ , ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి , పీఠ దేవతలను దర్శించి మొక్కులు చెల్లించుకుని, పూజ్య శ్రీ మాతాజీ వారి స్వామి వారి ఆశీస్సులు పొందారు. సాయంత్రం కళాకారులచే గాన కచేరి, జగద్గురువుల దివ్య సమక్షంలో పూజ్యశ్రీ మాతాజీ వారిచే శ్రీ మరకత శక్తికాళీ దేవికి దర్బారు సేవా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు

## తొట్టంబేడు మండలంలో సిమెంట్ రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు

### - వీధివాసుల ఆవేదన



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

మండలంలోని పూడి గ్రామంలోని కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి ముందర వీధిలో వర్షపు నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే వీధి ప్రారంభంలో ఉన్న రెండు ఇళ్ల యజమానులు తమ ఇళ్ల ముందు ఎర్రమట్టి, గ్రావెల్ తోలి రోడ్డు కంటే ఎత్తుగా చదును చేయడంతో వర్షపు నీటికి వెళ్లే దారి మూసుకుపోయిందని వీధివాసులు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ నీరంతా సిమెంట్ రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో ఆ వీధిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు నడవలేని పరిస్థితి నెలకొంది. నిలిచిన నీటి వల్ల దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడికి వచ్చే భక్తులు కూడా ఈ మురుగు నీటిలోనే నడవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి, ఆక్రమించిన మట్టిని తొలగించి, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు తగిన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జనని పోర్టల్‌లో ఆశా కార్యకర్తల మ్యాపింగ్‌ను పరిశీలించిన కేఎంఏ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు



ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా, బి.ఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేఎంఏ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డిని కలిసి జనని పోర్టల్‌లో ఆశా కార్యకర్తల మ్యాపింగ్ స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ రాజు మాట్లాడుతూ జనని పోర్టల్‌లో ఆశా కార్యకర్తల మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను సకాలంలో అందించవచ్చని తెలిపారు. ప్రతి ఏఎన్ఎం జనని పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆరోగ్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశమయ్యారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులకు అందించాల్సిన వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఓ గర్భిణిని కలిసి ఆమెకు అందుతున్న ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, ఇతర లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సిన సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని ప్రోగ్రాం ఆఫీసర్ రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ విజయమే ధ్యేయం!

### ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో మిద్దెల హరి బేటి స్థానిక ఎన్నికలలో సమన్వయంతో ముందుకెళ్తాం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని, తిరుపతి జిల్లా పార్లమెంట్ సమన్వయకర్తలు జనసేన పార్టీ నాయకులు మిద్దెల హరి తమ్మినేని వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి సమన్వయకర్త దండి నరేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెంజిగరం రమణ , అనుచరులు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులతో కలిసి మర్యాదపూర్వకంగా స్వగృహంలో కలవడం అయినది. ముందుగా ఎమ్మెల్యే వెంకట సుధీర్ రెడ్డిని కలంకారి శాలువాతో సత్కరించి మెమెంటోళ్లు అందజేయడమైనది.

ఎమ్మెల్యే మిద్దెల హరి ని శాలువాతో సత్కరించి తిరుపతి సమన్వయకర్తగా నియమితులైనందుకు సత్కరించడమైనది, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ, స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లి 100% స్ట్రైక్ రేటుతో విజయం సాధించాలని తెలియజేశారు. మిద్దెల హరి మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రెండున్నర సంవత్సరాలలో శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషిచేసి ఎన్నికలలో విజయ డంక మోగిస్తామని తెలిపారు. జనసేన తిరుపతి సమన్వయకర్త తమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల కోటా లో జనసేన పార్టీకి తగిన ప్రాతినిధ్యం కల్పించుటలో పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ చేసిన సూచనలను శాసనసభ్యులకు వివరిస్తూ తగు న్యాయం జరిగే విధంగా సమన్వయం చేసుకుందామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రమణగారు మాట్లాడుతూ మిద్దెల హరికి బీసీ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయంలో కూడా మా భాగస్వామి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గురజాల సుబ్బరాయులు, మిద్దెల జయరామయ్య, అన్నచ్చి చంద్ర ,ప్రముఖ న్యాయవాది రమణయ్య, టిడిపి నాయకులు నున్న బాలసుబ్బయ్య, తీర్థం వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ జయదేవనగిరి, వర్తక సంఘం ఉపాధ్యక్షులు దొంతు సుబ్రహ్మణ్యం , సహాయ కార్యదర్శి గంజి వెంకటేష్, చాముండేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శి పులి రాధాకృష్ణయ్య, జనసేన పార్టీ నాయకులు, ఈగల హరి రాయల్, తీగల భాను ప్రకాష్, బాలిశెట్టి నరసింహులు, దావాల గిరి, బొజ్జా ప్రభాకర్, కంటా మునిరత్నం, కోటా కరుణాకర్ శెట్టి,చల్లా సుధాకర్, సాధు మునస్వామి, చల్లా చెన్నయ్య, నున్న వీరయ్య, శేషయ్య, లోకయ్య, పైడి రాఘవులు, బండి రమేష్, నున్న చందు, మహర్షి, సౌందర్యరాజన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణ పగడ్బందీగా సాగాలి-పాకాల ఎంపీడీవో వాసుదేవరావు..

### కుల ధ్రువీకరణ పత్రాలు కావలసినవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.....పాకాల తాసిల్దార్ కిరణ్ కుమార్..

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు...పాకాల సీ.ఐ టీ.చిన్న గోవిందు..



ప్రజాభూమిప్రతినిధి, చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం,పాకాల మండలం,స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై ఎంపీడీవో వాసుదేవరావు,తాసిల్దార్ కిరణ్ కుమార్,సి.ఐ టి.చిన్న గోవిందు,డిప్యూటీ ఎంపీడీవో శశిరేఖ లు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వాసుదేవరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో వచ్చినందువల్ల మండల కేంద్రం నుండి గ్రామపంచాయతీల వరకు ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ,నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ ఎన్నికల నిర్వహణ వరకు ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు కావలసినవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.వీరికి నామినేషన్ల దాఖల లోపల కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని తెలిపారు.పాకాల సీ.ఐ టి.చిన్న గోవిందు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడం పై సంబంధిత అధికారు లతో చర్చించామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పాకాల మండలంలో ప్రశాంతమైన వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు, సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు.ప్రజలు ఎన్నికల సమయంలో సంయమనం పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎన్నికల విధుల నిర్వహణకు ఉద్యోగుల పూర్తి వివరాలను సకాలంలో సమర్పించాలి

### హెచ్ఓడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన మానవ వనరుల వివరాలను సకాలంలో సేకరించి, పూర్తి సమాచారాన్ని ఎక్సెల్ షీట్‌లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా స్థాయి శాఖాధికారులను (హెచ్ఓడీలు) ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఎన్నికల విధుల కేటాయింపునకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అధికారులకు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఇతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల వివరాల సేకరణ కోసం ఇప్పటికే డిఈఓలు, పీఓలు, సమగ్ర శిక్ష తదితర విభాగాల సిబ్బందికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. అయినప్పటికీ, కొన్ని శాఖల నుంచి ఉద్యోగుల వివరాలు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ కార్యాలయంతో పాటు క్షేత్రస్థాయి, మండల స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి, జిల్లా ఎన్నికల కార్యాలయం అందించిన ఎక్సెల్ షీట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఈ పని కాలపరిమితితో కూడుకున్నదని, అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం 6.30 గంటలలోపు లేదా నిర్దేశించిన గడువులోగా పూర్తి వివరాలను సమర్పించాలని, సమర్పించని శాఖాధికారులతో మరోసారి సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న వివరాలపై స్పష్టత తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగుల వివరాలు అందిన అనంతరం జిల్లా ఎన్నికల కార్యాలయం సిబ్బంది వాటిని పరిశీలించి, ఎన్నికల విధుల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.ఉద్యోగుల వివరాల సేకరణలో ఎలాంటి పక్షపాతం లేకుండా, అన్ని శాఖల్లో పనిచేస్తున్న అర్హులైన సిబ్బంది వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, నిర్దిష్ట వైద్యపరమైన సమస్యలు కలిగిన వారు, దివ్యాంగులు, క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు, మానసిక వైకల్యం కలిగిన పిల్లల సంరక్షణకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులు ఉన్న ఉద్యోగుల విషయంలో వర్తించే నిబంధనల ప్రకారం మినహాయింపులను పరిశీలించాలని తెలిపారు. మినహాయింపులు కోరే సందర్భాల్లో అవసరమైన ప్రభుత్వ వైద్య ధ్రువపత్రాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, శిక్షణ షెడ్యూళ్లు, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 16,17,18, తేదీలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.చిత్తూరు, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిర్ణీత గడువులోగా వివరాలు సమర్పించకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పుట్లూరు సీఐగా వంశీకృష్ణ



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్గా వంశీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ సత్యబాబు బదిలీపై వీఆర్ వెళ్లారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేసినట్లు తెలిసింది. వంశీకృష్ణ గతంలో పుట్లూరు ఎస్. ఐ గా విధులు నిర్వహించారు.

# బాబ్జి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పవన్ స్వేరో జన్మదిన వేడుకలు

### నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు.. యువ నాయకుడు మహేష్ స్వేరో ముఖ్య అతిథిగా హాజరు



ప్రజా భూమి ప్రతినిధి: ఐరాల పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం మొరుంపల్లె గ్రామంలో బాబ్జి యూత్ ఆధ్వర్యంలో పవన్ స్వేరో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ నాయకుడు మహేష్ స్వేరో ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని మహేష్ స్వేరో ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి వద్ద ఉంచిన జాకెట్లు, పసుపు, కుంకుమ, గాజులను మహేష్ స్వేరో భక్తులకు పంపిణీ చేశారు. నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఈ వస్తువులను అందజేయడం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా యువ నాయకుడు మహేష్ స్వేరో కార్యక్రమంలో పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలతో పాటు నవరాత్రుల పూజా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా బాబ్జి యూత్ సభ్యులు తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, సోము, బ్రహ్మతేజ, కిరణ్, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. బాబ్జి యూత్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను, నవరాత్రుల ప్రత్యేక పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి రేసులో షేక్ సిరాజ్ బాషా..



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో చైర్మన్ పదవిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున శ్రీకాళహస్తి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా షేక్ సిరాజ్ బాషా పేరు తెరపైకి వచ్చింది. ప్రజల్లో తనకున్న పరిచయాలు, రాజకీయంగా తనకున్న గుర్తింపుతో చైర్మన్ పదవికి పోటీ పడేందుకు ఆయన సిద్ధమవుతున్నారనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.శ్రీకాళహస్తి మున్సిపల్ రాజకీయాల్లో షేక్ సిరాజ్ బాషా పేరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది!

# శ్రీ శ్రీ సీతాలాంభ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాటంరెడ్డి పవిత్ర రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ దేవీ నవరాత్రుల శుభ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలమంగళం రవి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటలో వెలసిన శ్రీ శ్రీ సీతాలాంభ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో బాలిశెట్టి శేఖర్,పుట్ట లీలావతి, కళ్యాణి, శివ,పటాన్ ఫరీద్, జూమ్లేష,ముని రెడ్డి, కార్తీక్ మహమ్మద్ సూర్య శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ నేపథ్యంలో రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు.

ప్రజాభూమి పరిధినిధి రేణిగుంట.

గంజాయి,నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆదేశాల మేరకు, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు సూచనలతో ఎక్సైజ్ అధికారులు రేణిగుంట రైల్వే స్టేషన్, పార్సిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై కవీశ్వర్ నాయుడు సిబ్బందితో కలిసి గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు రైల్వే స్టేషన్, పార్సిల్ కార్యాలయాల్లో నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై కవీశ్వర్ నాయుడు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబానికి అండగా జనసేన నాయకులు..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి: నియోజకవర్గ పరిధిలోని తొండవాడ గ్రామంలో కనీసం నివాస సౌకర్యం కూడా లేకుండా చెట్ల కిందే జీవనం సాగిస్తూ, మేకలు, గొర్రెలు, పందులను పెంచుకుంటూ వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్న నిరుపేద కుటుంబానికి జనసేన నాయకులు తపస్సు మురళి రెడ్డి, హరి యాదవ్ అండగా నిలిచారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఎన్నో కష్టాల మధ్య జీవనం సాగిస్తున్న ఆ కుటుంబంలో ఇటీవల పాప జన్మించిన విషయం తెలుసుకున్న తొండవాడ విద్యా కమిటీ చైర్మన్ హరి యాదవ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తపసి మురళి రెడ్డి స్పందించారు. ఆ చిన్నారికి అవసరమైన దుస్తులతో పాటు, శిశువు ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకొని డాక్టర్లు సిఫార్సు చేసే నాణ్యమైన బేబీ కేర్ ఉత్పత్తులతో కూడిన కిట్‌ను అందజేశారు.పేద కుటుంబాల్లో సైతం ఆనందం వెల్లివిరియాలనే ఉద్దేశంతో, ముఖ్యంగా పుట్టిన చిన్నారులు ఆరోగ్యంగా పెరగాలనే ఆకాంక్షతో ఈ సహాయం అందించినట్లు వారు తెలిపారు.పేదల కళ్లలో కనిపించే చిరునవ్వే తమకు నిజమైన సంతృప్తి అని, అవసరమైన వారికి చేతనైనంత సహాయం అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని కూటమి నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అండగా నిలుస్తూ, జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి నాయకులు సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

శుక్రవారం 16 అక్టోబరు 2026

# భక్తజన సందోహంతో ఇంద్రకీలాద్రి.. సేవల సమన్వయంతో సౌకర్యవంతమైన దర్శనం

## రద్దీ నియంత్రణకు సాంకేతిక నిఘా.. తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించు కున్నాయి. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్ల నిర్వహణ, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సహాయం వంటి అంశాలపై వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సేవలందిస్తున్నాయి.





**సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీ.కె. శీనా నాయక్, దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా గాంధీ నేతృత్వంలో దర్శన ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లా యంత్రాంగం, దేవాదాయశాఖ, దేవస్థానం సిబ్బంది పరస్పర సమన్వయంతో భక్తులకు సాధ్యమైనంత సౌకర్యవంతంగా దర్శనం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**ఏఐతో రద్దీపై నిఘా.. పోలీసుల అప్రమత్తత**

నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు పర్యవేక్షణలో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేసింది. కృత్రిమ మేధస్సు ఆధారిత రద్దీ విశ్లేషణ, సీసీ కెమెరాలు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల సహాయంతో భక్తుల రాకపోకలను పర్యవేక్షించే ఏర్పాట్లు చేశారు. రద్దీ పెరిగే ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తం చేయడం, వాహనాల రాకపోకలను నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ వ్యవస్థల ప్రధాన ఉద్దేశం.

**తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యం**

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర పర్యవేక్షణలో భక్తుల రాకపోకల మార్గాలు, క్యూలైన్ల పరిసరాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించారు. క్యూలైన్లలో తాగునీరు అందుబాటులో ఉంచడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, తాత్కాలిక మరుగుదొడ్లను శుభ్రంగా నిర్వహించడం వంటి చర్యలు భక్తుల సౌకర్యానికి తోడ్పడుతున్నాయి.

**వైద్య సహాయం.. సేవా స్ఫూర్తి**

రద్దీ సమయంలో అస్వస్థతకు గురయ్యే భక్తులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవల ఏర్పాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, ఇతరుల సహాయం అవసరమైన భక్తులకు సిబ్బంది మార్గనిర్దేశం చేస్తున్నారు. భక్తులు క్యూలైన్లలో క్రమశిక్షణ పాటిస్తూ, అధికారుల సూచనలకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.దసరా ఉత్సవాల నిర్వహణలో దేవాదాయశాఖ, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, వైద్యశాఖ, సేవా సంస్థల సమన్వయం కీలకంగా నిలుస్తోంది. భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ముస్సిపల్ పీఠంపై ఉత్కంఠ....!-అధికార టీడీపీలో ఆశావహుల పోటీ..

### -వైసీపీలోనూ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ -టిడిపి నుండి డీఈ రమేష్‌కుమార్ లేదా శివశంకర్

### -వైసీపీ నుంచి డాక్టర్ భాషా భార్య షాజియా పేరు ప్రముఖంగా ప్రచారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘం చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించడంతో పట్టణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార తెలుగుదేశం పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అయితే రిజర్వేషన్ ఖరారు కావడంతో ఇరు పార్టీల్లోనూ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు చైర్మన్ పదవిని ఆశిస్తుండటంతో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశం ఆయా పార్టీల నాయకత్వాలకు సవాల్‌గా మారింది. మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ జనరల్ రిజర్వేషన్ ఖరారు కావడంతో సమీకరణాలు మారిపోయాయి. పార్టీలో బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ఉండటంతో వారిలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై టీడీపీ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఒకరికి అవకాశం కల్పిస్తే మరొకరు అసంతృప్తికి గురయ్యే పరిస్థితి ఉండటంతో సామాజిక సమీకరణాలు, రాజకీయ అనుభవం, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ నుంచిగ మాజీ చైర్‌పర్సన్ డీఈ రమేష్‌కుమార్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. గతంలో పురపాలక సంఘం చైర్మన్ గా పనిచేసిన అనుభవం, పట్టణ రాజకీయాలపై అవగాహన ఆయనకు అనుకూల అంశాలుగా భావిస్తున్నారు. మరోసారి ఆయనకు అవకాశం కల్పించే దిశగా పార్టీ ముఖ్య నాయకులు ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన అభ్యర్థిత్వం బలంగా ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ, పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదు. మరోవైపు, 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో అధికారంలో లేకపోయినా చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగిన చంద్రమోహన్ యాదవ్‌కు మరోసారి అవకాశం కల్పించాలనే ఆలోచన కూడా పార్టీలో ఉన్నట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు మహిళా నాయకురాలు పరిమళ, బీసీ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది శివశంకర్ పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే, వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది. అందుబాటులో ఉన్న రాజకీయ సంకేతాలను పరిశీలిస్తే డీఈ రమేష్‌కుమార్ పేరు ముందంజలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, సామాజిక సమీకరణాలు, పార్టీ అంతర్గత నిర్ణయాలు తుది అభ్యర్థి ఎంపికలో కీలకం కానున్నాయి. ఇదిలా ఉండగా, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికపై చర్చలు సాగుతున్నాయి. కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివ, మైనార్టీ నాయకులు ఆసిఫ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు డాక్టర్ భాషా భార్య షాజియా పేరుపైనా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్ల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీలోనూ పలువురు ఆశావహులు ఉండటంతో అభ్యర్థి ఎంపిక ఆసక్తికరంగా మారింది. హిందూపురం పట్టణంలో బీసీ సామాజిక వర్గానికి ఉన్న ప్రాధాన్యత, మైనార్టీ ఓటర్ల ప్రభావం, గతంలో ఆయా నాయకులు నిర్వహించిన రాజకీయ పాత్ర, వార్డుల వారీగా పార్టీ బలాబలాలు అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్నాయి. చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికతో పాటు కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక కూడా రెండు పార్టీలకు కీలకంగా మారనుంది. బలమైన అభ్యర్థిని బరిలోకి దింపడంతో పాటు అసంతృప్తులకు తావులేకుండా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం ఇరు పార్టీలకు ముఖ్యమైన అంశంగా మారింది. ముఖ్యంగా టీడీపీ నుంచి డీఈ రమేష్‌కుమార్, వైసీపీ నుంచి డాక్టర్ భాషా భార్య షాజియా అభ్యర్థులుగా ఖరారైతే హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక మరింత ఆసక్తికరంగా మారే అవకాశముంది. అనుభవం, పార్టీ కేడర్ మద్దతు, సామాజిక సమీకరణాలు, స్థానికంగా ఉన్న రాజకీయ సంబంధాలు ఈ పోటీలో కీలక పాత్ర పోషించవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, ఈ ఇద్దరి పేర్లతో పాటు ఇతర ఆశావహుల అభ్యర్థిత్వాలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, బీసీ జనరల్ రిజర్వేషన్ హిందూపురం మున్సిపల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీసింది. ఆశావహుల సంఖ్య పెరగడంతో అభ్యర్థుల ఎంపిక ఇరు పార్టీలకు పరీక్షగా మారింది. చివరకు ఎవరికి పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తుంది.. ఎవరిని ప్రజలు ఆదరిస్తారు, హిందూపురం మున్సిపల్ పీఠం ఏ పార్టీకి దక్కుతుందన్న ప్రశ్నలకు సమాధానం ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగేకొద్దీ తేలనుంది.

# జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి..

### -జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడిన తరుణం ఈ నెల 14 నుంచే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) పూర్తిగా అమల్లోకి వచ్చిందని, జిల్లాలో ఎన్నికల కోడ్ ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిణ ప్రక్రియలో భాగంగా గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిణ, ఎన్నికల కోడ్ అమలుపై ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. మున్సిపాలిటీలు, మండల పరిషత్తులు(ఎంపీటీసీ), జిల్లా పరిషత్తుల(జెడ్పీటీసీ) ఎన్నికలు జరగనున్నందున, ఈ ఎన్నికలతో సంబంధం ఉన్న అన్ని రెవెన్యూ డివిజన్లు పూర్తిగా ఎన్నికల నిబంధనల పరిధిలోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాలు ఎన్నికల పరిధిలో లేకపోయిన ప్పటికీ, ఎన్నికల కోడ్ నిబంధనలు మాత్రం మొత్తం జిల్లా వ్యాప్తంగా వర్తిస్తాయని ఆయన తెలిపారు. ఈ నెల 14 నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ఈ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడా కోడ్ ఉల్లంఘనలు జరగకుండా చూసే పూర్తి బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని, ఇందుకు ప్రత్యేకంగా ప్రతి మండలంలో అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన 24 గంటలలోపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న అన్ని రకాల రాజకీయ ప్రకటనలు, ఫోటోలు, పోస్టర్లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, ప్రకటన వచ్చిన 48 గంటలలోపు పబ్లిక్ ప్రదేశాలలో ఉన్నటువంటి రాజకీయ సంబంధిత పోస్టర్లు, గోడ రాతలు మరియు బ్యానర్లను కూడా పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేసుకొని పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు నిర్ణీత తేదీలు నిర్ణయించబడ్డాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయబడి, మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. అప్పీళ్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ అనంతరం నవంబరులో పోలింగ్, కౌంటింగ్ నిర్వహించ బడుతుందన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు.ప్రజల వ్యక్తిగత గోప్యతను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు విధిగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ స్థలాలు లేదా భవనాలను ప్రచార నిమిత్తం వాడాలంటే సంబంధిత అధికారుల నుండి రాతపూర్వక అనుమతి పొందాలని తెలిపారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం, ప్రార్థనా స్థలాలను ప్రచారానికి ఉపయోగించడం పూర్తిగా నిషిద్ధమని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, డబ్బులు పంచడం, బెదిరించడం వంటి అసాధారణ చర్యలకు పాల్పడితే చట్టపరమైన కేసులు నమోదు చేయబడతాయని ఆయన తెలిపారు. పోలింగ్ సమయానికి నిర్దిష్ట గంటల ముందే సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుందని, ఆ సమయంలో ఎటువంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎటువంటి కొత్త ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాలు, గ్రాంట్లు లేదా ఆర్థిక హామీలు ప్రకటించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు మరియు సిబ్బంది అత్యంత నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజాప్రతినిధుల అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారాలతో క్లబ్ చేయడానికి వీలులేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వ వాహనాలను లేదా అధికారిక యంత్రాంగాన్ని ఎన్నికల ప్రచార నిమిత్తం ఏ అభ్యర్థి కూడా వినియోగించు కోకూడదని హెచ్చరించారు.పబ్లిక్ మీటింగ్‌లు లేదా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నా, మైకులు లేదా లౌడ్ స్పీకర్లు వాడాలన్నా ముందస్తుగా అధికారుల నుంచి అనుమతి పొందాలని కలెక్టర్ సూచించారు. ఒకే సమయంలో ఒకే ప్రాంతంలో వేర్వేరు పార్టీలు సభలు లేదా ర్యాలీలు నిర్వహించకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆస్పత్రులు, విద్యాసంస్థల సమీపంలో శబ్ద కాలుష్యం కలిగించే కార్యక్రమాలకు అనుమతి లేదని తెలిపారు. అనుమతి పొందిన ప్రింటెడ్ మెటీరియల్, పోస్టర్లపై ముద్రణదారుని పేరు, చిరునామా స్పష్టంగా ముద్రించబడి ఉండాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి, అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో డా. డి.తిప్పేనాయక్, కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, పంచాయతీ అధికారి, వి. రవికుమార్, కాకినాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ. సుధాకర్, స్వర్ణ గ్రామ వార్డు అధికారి జె.వెణుగోపాల్ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి : కనపర్తి

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులు నూరు శాతం విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. గురువారం మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ,కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని కనపర్తి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు,మాజీ జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు,పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు,చందన రంగారావు,దిడ్ల జానకీ రాంబాబు,పుప్పాల ఏసు,కొమ్ము పవన్,కొక్కిలిగడ్డ శివుడు,గవిని శివరామ కృష్ణ,మాతంగి జనార్దన్, నాగబాబు,పీతా కనకయ్య,కందుల బసవయ్య,యక్కటి అర్జునరావు,కంచర్ల శ్రీనివాసరావు,మోటుపల్లి జనార్దన్,గొరిపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఆహా.. ఎంత హాయి.. అనిపించేలా ప్రభుత్వ ఆసుపత్రి ...



ప్రజా భూమి. యల్లనూరు

యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలుపల నుంచి చూస్తే రోడ్డు ఇరువైపులా పచ్చటి చెట్ల నడుమ నడుచుకుంటూ వెళుతుంటే చల్లటి గాలి, నీడ బయట ఇలా ఉంటే ఇక ఆసుపత్రి లోపల అయితే ఎత్తయిన చెట్లు పూల మొక్కల నడుమ అపరి శుభ్రతకు తావు లేకుండా ఎలా ఉంటుందో చెప్పకనే చెబుతాయి ఆసుపత్రి లోపలి ప్రాంగణ పరిసరాలు ఇక పోతే మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలకు సంబంధించి బీపీ షుగరు టైఫాయిడ్ మలేరియా జ్వరం అనారోగ్య సమస్యల దృష్ట్యా చాలామంది అవుట్ పేషెంట్స్, ఆసుపత్రి ఆవరణలోకి రాగానే ఇది కదా మనసుకు ప్రశాంతతను ఇచ్చే వాతావరణం అనుకుంటూ.. సేద తీర్చుకుని ఆ తర్వాత వైద్యులను సంప్రదిస్తున్నారు.

పేషెంట్స్ చెప్పే విషయం: పరిసరాల పరిశుభ్రత పాటించడంలో రోగులను పరీక్షించే విధానం వారికి ఎటువంటి పరీక్షలు అవసరం అని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాత తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెప్పే విధానం చాలా బాగా ఉందని ఇంకా మెరుగైన వైద్యం కోసం తాడిపత్రి ప్రాంతీయ వైద్యశాల పంపడం ద్వారా చాలా మంచి మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వచ్చిన వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ తప్పక చెప్పు ప్రైవేటు వైద్యశాలకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉంది ఎటువంటి ఖర్చులు లేకుండా మండల వ్యాప్తంగా ప్రజలు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చు అని తద్వారా మీకు డబ్బు ఆదా అవడమే కాకుండా మెరుగైన వైద్యం అందుతుంది దీంతో పాటు ఎల్లవేళలా సిబ్బంది కూడా,మీకు అందుబాటులో ఉంటారు గ్రామాలలో ఏఎన్ఎమ్స ఆశా వర్కర్స్ అందుబాటులో ఉంటారు ప్రజలకు సేవ చేయడం ప్రజల నుంచి మంచి ఆదరణ లభించడం దేవుడిచ్చిన ఒక గొప్ప వరం అని వైద్యుల లోకేష్ కుమార్ తెలిపారు.

# హరిత ఉత్సవాలు - సుస్థిర వేడుకలే ఈ నెల ప్రధాన ఇతివృత్తం

### - జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17వ తేదీ, మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా 'హరిత ఉత్సవాలు -- సుస్థిర వేడుకలు' అనే ప్రధాన ఇతివృత్తంతో ప్రత్యేక పారిశు ధ్య, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించను న్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్ గురు వారం ఒక ప్రకటన లో వెల్లడిం చారు.రాబోయే పండుగలు, శుభకార్యాలు, ఇతర వేడు కలను పర్యావరణ హితంగా నిర్వహించాలనే సందే శాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ నెల కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కార్యక్ర మాలను ప్రణా ళికాబద్ధంగా క్షేత్రస్థాయిలో అమలు చేయ డంతో పాటు, వాటి పురోగతిని సులభంగా పరిశీలించి, అవసర మైన తదుపరి చర్యలు చేపట్టేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థా యిలో నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని, వాటికి ప్రత్యా మ్నాయంగా పునర్వినియో గానికి అనువైన పర్యావరణ హిత సామగ్రిని వినియోగించే లా ప్రజలకు అవగాహన కల్పిం చాలని తెలిపారు.గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు, ప్రభుత్వ కార్యాల యాలు, ప్రజా స్థలాలు, పండుగలు నిర్వహించే బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక పా రిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పండుగలు, వేడుకల అనం తరం ఏర్పడే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి, వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, రీసైక్లింగ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రజాప్రతినిధు లు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల భాగస్వా మ్యంతో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వ హించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చ దనం పెంపొందిం చడం, పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొ న్నారు.మండల, పురపాలక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాల అమలును పరిశీలించాలని, నిర్వహించిన కార్యక్రమాలకు సంబం ధించిన ఫొటోలు, నివేదికలను నిర్ణీత ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు.జిల్లాలోని ప్రజాప్రతినిధు లు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు సమష్టిగా భాగస్వా ములై స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రశ్రీ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని డాక్టర్ డి. తిప్పే నాయక్ పిలుపునిచ్చారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారికి రూ. 75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం బహూకరణ

### 494 గ్రాముల బంగారు కిరీటం సమర్పించిన శ్రీకాకుళం దాతలు

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల వేళ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారికి గురువారం ఉదయం విశేష స్వర్ణ కానుక సమకూరింది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన భక్తులు కూర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడు కె. దుర్గా శ్రీనివాస్ అమ్మవారికి సుమారు రూ. 75 లక్షల విలువైన దివ్య స్వర్ణ కిరీటాన్ని భక్తిప్రపత్తులతో సమర్పించారు. ఎరుపు, నీలం, తెలుపు, పచ్చ రాళ్లతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన 494 గ్రాముల బరువు గల ఈ నవరత్న ఖచిత బంగారు కిరీటాన్ని దాతలు ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారివి.కె. శీనా నాయక్, దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు సంయుక్తంగా ఈ కానుకను స్వీకరించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం పలకగా, అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా దాత కె. దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోకపావని అయిన కనకదుర్గమ్మ దయవల్లే తాము ఈ కానుకను సమర్పించుకోగలిగామని, పవిత్రమైన దసరా శరన్నవరాత్రుల పర్వదినాల్లో అమ్మవారికి స్వర్ణ కిరీటం బహూకరించే భాగ్యం కల్పించినందుకు ఆలయ ఈవోగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.



# పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలకు షెడ్యూల్

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3నగ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటి దశ నవంబర్ 26న , రెండవ దశ నవంబర్ 29న పోలింగ్**

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

జిల్లాలో స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 19న ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌తో ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ గురువారం తెలిపారు. అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారని, అక్టోబర్ 23 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీల్, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం, అక్టోబర్ 27న అభ్యర్థిత్వాల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న తిరిగి పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయని తెలిపారు. పరోక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 7వ తేదీలోగా సభ్యులకు నోటీసులు అందించి, నవంబర్ 11 లేదా 12న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికలు చేపడతారని వివరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**❖ నామినేషన్లు, ఓటర్ల జాబితాలు, ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి ❖ సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్ర నివేదికలు సమర్పించాలి ❖ జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి ❖ కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-425-4225 క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాలు**

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల సన్నాహకాలు, నామినేషన్ల ప్రక్రియ, ఓటర్ల జాబితాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకాలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భం గా కలెక్టర్ కె దినేష్ కుమార్ దిశా నిర్దేశం చేస్తూ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎన్నికల ఏర్పాట్లను సమన్వయంతో పర్యవేక్షించాలని, రంపచోడ వరం, చింతూరు సబ్ కలెక్టర్లు తమ డివిజన్ల పరిధిలోని ఏర్పాట్లపై వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా సహకరించాలి



**అడ్డతీగల మండల ప్రజలకు ఎంపీడీవో ఏవీవీ కుమార్ సూచన**

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు లోకి వచ్చిన నేపథ్యంలో అడ్డతీగల మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు నిబంధనలకు సహకరించాలని ఎంపీడీవో ఏవీవీ కుమా ర్ కోరారు. గ్రామాల పరిధిలో రాజకీయ పార్టీలకు సంబంధిం చిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ రాతలు, కరపత్రాలు ఉంటే వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పంచాయతీ కార్యదర్శులు, అభివృద్ధి అధికారులు వాటిని తొలగిస్తారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అసంపూర్తిగా నిలిచిన ఎన్టీఆర్ ఇళ్లను పూర్తి చేయాలి

**పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని బీజేపీ నాయకుల విజ్ఞప్తి**

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:



వి.ఆర్.పురం మండలంలోని పెద్ద మ టపల్లి పంచాయతీ పరిధిలో 2017–18 సంవత్సరంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తుర్రం వెంకట నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఉయిక రత్తయ్య గురువారం పెద్దమటపల్లి పంచాయతీ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో కారం రమాదేవి, సున్నం శారద, వీరబోయిన రాజు, వీరబోయిన కృష్ణమ్మ, గుప్పనపల్లి వీర స్వామి, వీరబోయిన రమేష్, మడకం శారద ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించినట్లు వారు తెలిపారు. నిలిచిపోయిన ఈ ఇళ్ల నిర్మాణాలను ఉన్నతస్థాయి అధికారులు పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల బిల్లులను మంజూరు చేయాలని వారు కోరారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు ఎంతో ముఖ్యమని, నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన చేపట్టి, పెండింగ్ బిల్లుల మంజూరుతో పాటు అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కోవెలపాలెంలో దోమతెరల పంపిణీ

**దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన**

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల



జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలంలోని దుప్పుల పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురు వారం కోవెలపాలెం గ్రామంలో దోమతెరలను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నాగ దివ్య, సామాజిక ఆరోగ్య అధికారి పోశమ్మ పర్యవేక్షణలో మలేరియా ఉప విభాగ అధికారి కె. లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధి, బోదకాలు తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధుల లక్షణాలు కనిపించినప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలని, దోమతెరలను వినియోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమతెరలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ నాగ దివ్య, సామాజిక ఆరోగ్య అధికారి పోశమ్మ, మలేరియా ఉప విభాగ అధికారి కె. లక్ష్మణరావు, బహుళ ప్రయోజన సాంకేతిక సిబ్బంది శ్రీనివాస్, వెలుగు సమాజ సమన్వయకర్త కుమార్ రాజా, బహుళ ప్రయోజన విస్తరణ అధికారి నాగేంద్ర, బహుళ ప్రయోజన ఆరోగ్య సహాయకుడు రామమూర్తి, సహాయక నర్సు గంగాభవాని, ఆశా కార్యకర్త సమంతకమణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ అమలు గంగవరంలో రాజకీయ ఫ్లెక్సీలు బ్యానర్ల తొలగింపు

**ఎన్నికల నియమావళికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి**

ప్రజా భూమి ప్రతినిధి గంగవరం:





పోలవరం జిల్లాలో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమ లులో భాగంగా గంగవరం గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు తనిఖీలు నిర్వహించి,వివిధ రాజకీ య పార్టీలకు చెందిన ప్రచార ఫ్లెక్సీలు,బ్యానర్లు,జెండాలు,వాల్ పోస్టర్లను తొలగించారు ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసే చర్యల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లు,ప్రభుత్వ భవనాలు,విద్యుత్ స్తంభాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని పంచాయతీ సిబ్బంది తొలగించినట్లు అధికారులు తెలిపారు ఎన్నికలు ప్రశాంత వాతావ రణంలో,నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు సహకరించాలని ప్రత్యేక అధికారి,పంచాయతీ కార్యదర్శి కోరారు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు

# భక్తుల సేవలో.. కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ..

**- కమాండ్ కంట్రోల్ కేంద్రంతో పాటు క్షేత్రస్థాయిలో సుడిగాలి తనిఖీలు**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



దసరా ఉత్సవాల్లో 5వరోజు -జగన్మాత శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తుండగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతుంది. అన్ని క్యూ లైన్లలో భక్తులు తరలివెళ్తూ అమ్మ దర్శనం చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో క్యూలైన్లను పరిశీలిస్తుండటంతో పాటు కొండ దిగువున గల సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. సమ న్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. రద్దీ నియంత్రణ, వీవీఐపీ, వీఐపీ వాహనాల రాకపోకలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, శాంతిభద్రతల పరిరక్షణ.. ఇలా ప్రతి విషయంలోనూ సీసీసీ ఉత్స వాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీటీవీలు, డ్రోన్ల విజువల్స్‌ను నిరంతరం పరిశీలిస్తూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాల విజయ వం తానికి సీసీసీ సిబ్బంది కృషిచేస్తున్నారు. ఆధునిక కెమెరాల డేటాను కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌ను నిశితంగా పరిశీలిస్తూ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా, నిబంధనల ఉల్లంఘనల జరక్కుండా చూస్తున్నారు.

# పోలవరం జిల్లా లో వన్‌స్టాప్ సెంటర్‌లో మూడు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**అక్టోబర్ 24 చివరి తేదీజిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారిణి కె. ఉమా**

ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం

సెలెక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలవరం జిల్లా మహిళా, శిశు సంక్షేమం మరియు సాధికారత శాఖ పరిధిలోని వన్‌స్టాప్ సెంటర్‌లో మూడు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారిణి కె. ఉమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాలు పథకం అమలులో ఉన్నంతకాలం, నిబంధనల మేరకు ఉంటాయని పేర్కొన్నారు. మానసిక – సామాజిక సలహాదారు (జనరల్) పోస్టు ఒకటి, బహుళ ప్రయోజన సిబ్బంది/వంటమనిషి (ఎస్సీ మహిళ) పోస్టు ఒకటి, సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డు (ఎస్సీ మహిళ) పోస్టు ఒకటి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మానసిక – సామాజిక సలహాదారు పోస్టుకు సైకాలజీ, సైకియాట్రీ లేదా న్యూరోసైన్సెస్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ/డిప్లొమాతో పాటు సంబంధిత రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. బహుళ ప్రయోజన సిబ్బంది పోస్టుకు అక్షరాస్యత, సంబంధిత పని అనుభవం ఉండాలి. హైస్కూల్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఇస్తారు. సెక్యూరిటీ గార్డు పోస్టుకు ప్రభుత్వ లేదా ప్రతిష్ఠాత్మక సంస్థలో భద్రతా సిబ్బందిగా కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.పదవీ విరమణ చేసిన సైనిక లేదా అర్ధసైనిక సిబ్బందికి ప్రాధాన్యం ఉంటుంది.2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 25 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోసడలింపు వర్తిస్తుంది.మానసిక – సామాజిక సలహాదారుకు నెలకు రూ.20,000, బహుళ ప్రయోజన సిబ్బందికి రూ.13,000, సెక్యూరిటీ గార్డుకు రూ.15,000 పారితోషికం చెల్లిస్తారు.అర్హులైన మహిళలు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://polavaram.ap.gov.in నుంచి దరఖాస్తు నమూనా, నిబంధనలు (TOR) పొందవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాల నకళ్లను జతచేసి 2026 అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయ పనిదినాల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.కార్యాలయం దేవీపట్నం రోడ్డులో, సబ్ కలెక్టర్ కార్యాలయం పక్కన, పోలవరం జిల్లా, పిన్ 533288 చిరునామాలో ఉందని ఆమె తెలిపారు.

# ఆసుపత్రి భవనానికే నాణ్యత పరీక్షా?





**కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణంలో నాసిరకం మెటీరియల్ ఆరోపణలు పనులపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని బీజేపీ డిమాండ్**

జాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:

పోలవరం జిల్లా వి.ఆర్. పురం మండలం పెద్దమటపల్లి పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ, భవన నిర్మాణంలో నాసిరకం నిర్మాణ సామగ్రిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయనీ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి భవన నిర్మాణంలోనే నాణ్యతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తడం ఆందోళనకు గురిచేస్తోందనీ జిల్లా ఉపాధ్యక్షుడు తుర్రం వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉయిక రత్తయ్య అన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన వైద్య భవనం నిర్మాణంలో ఏమాత్రం నాణ్యతా లోపాలకు తావుండకూడదని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే భవిష్యత్తులో భవనం భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యతపై ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు నిర్వహించారు? ఉపయోగిస్తున్న మెటీరియల్‌కు నాణ్యతా పరీక్షలు చేశారా? కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారమే పనులు చేపడుతున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా ఉపాధ్యక్షుడు తుర్రం వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉయిక రత్తయ్య డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉపయోగిస్తున్న ఇసుక, సిమెంట్, ఇనుము, కంకర తదితర సామగ్రి నాణ్యతను సాంకేతిక నిపుణులతో పరీక్షించాలని కోరారు. నాణ్యతా లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.బిప్రజలకు సురక్షితమైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని వారు పేర్కొన్నారు. ఆసుపత్రి భవనం నిర్మాణంలో నాణ్యతపై వస్తున్న ఆరోపణలపై అధికారులు మౌనం వీడి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరారు.

# రంపచోడవరం దేవీ గుడిలో లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారు





ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లా డివిజన్ కేంద్రం రంపచోడవరం లో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగం గా నేడు అమ్మవారిని లలిత త్రిపుర సుం దరి రూపంలో అ లంక రించి నారు.రంపచోడవరం సంత మార్కెట్లో కొలువై ఉన్న శ్రీ వాసవి సమేత కనకదుర్గ దేవి ఆలయం నందు దేవీ నవరాత్రి 5వ రోజు పురస్కరించుకుని అమ్మవార్లకి లలితా త్రిపుర సుందరి దేవి రూపంలో కుంకుమ పూజలు చేయడం జరిగింది భక్తులు హాజరై దేవి ఆశీస్సులు పొందారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన అభ్యర్థులు సిద్ధంగా ఉండాలి

**ఆత్మీయ సమావేశంలో మండల నాయకుల పిలుపు**

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులందరూ సిద్ధంగా ఉండాలని జనసేన పార్టీ అడ్డతీగల మండల నాయకులు కుప్పాల జయరాం సూచించారు. కూటమి కేటాయించిన స్థానాల్లో బలంగా ముందుకు సాగి, 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించే లక్ష్యంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.ఈ సమావేశంలో పార్లమెంటరీ కమిటీ సభ్యుడు వీరేంద్రరెడ్డి, అసెంబ్లీ కమిటీ సభ్యులు రవి, సురేష్, కృష్ణారెడ్డి, దినేష్, నరసయ్య, జనసేన పార్టీ నాయకులు చిన్నారెడ్డి, వీర మహిళ అరుణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పక్కాగా పాటించాలి

**• చైర్‌పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులకు రూ.3 వేల డిపాజిట్ • ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,500 డిపాజిట్**

**-ఎన్నికల అధికారుల సమీక్ష సమావేశంలో కమిషనర్ మల్లికార్జున**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ కమి షనర్, ఎన్నికల అధికారి మల్లికార్జున సూచించా రు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు ప్రతి దశలోనూ అధికా రులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన ఎన్నికల ఏర్పాట్లు, అనుసరించాల్సిన విధివిధానాలపై గురువారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని తన చాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ క్రాంతి కుమార్‌తో కలిసి పురపాలక సంఘ పరిధిలోని 52 వార్డులకు నియమించిన ఎన్నికల అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు చేపట్టాల్సిన విధులు, నామినేషన్ల స్వీకరణలో పాటించాల్సిన నిబంధనలు, నామినేషన్ పత్రాల పరిశీలన, డిపాజిట్ మొత్తాల స్వీకరణ, అభ్యర్థుల ఉప సంహరణ తదితర అంశాలపై కమిషనర్ సమగ్రంగా వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అధ్యయ నం చేసి, వాటి ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను స్పష్టంగా తెలుసుకుని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మల్లికార్జున సూచించారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను స్వీకరించిన అనంతరం వాటిలో పొందు పరిచిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలు జత చేశారా, పత్రాల్లోని వివరాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను జాగ్రత్తగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. నామినేషన్ల పరిశీలన సమయంలో ఏవైనా సందేహాలు తలెత్తితే ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించా లని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణకు సంబంధించిన ప్రక్రి యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా రూ.3,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.1,500 డిపాజిట్ చెల్లించాలని కమిషనర్ వివరించారు. డిపాజిట్ చెల్లింపుల విషయంలో నిర్దేశిత విధానాన్ని పాటించాలని సూచించారు. అభ్యర్థులు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) రూపంలో డిపాజిట్ చెల్లించిన పక్షంలో పురపాలక సంఘ కార్యాలయంలో సంబంధిత మొత్తాన్ని చెల్లించి రసీదు పొందాలని తెలిపారు. ఒకవేళ ఎన్నికల అధికారులు అభ్యర్థుల నుంచి నగదును స్వీకరించాల్సి వస్తే, ఆ మొత్తాన్ని కార్యాలయంలోని ఖజానాలో జమ చేసి అధికారిక రసీదు పొందాలని స్పష్టం చేశారు. రసీదులో ఒక ప్రతిని ఎన్నికల అధికారి తన వద్ద భద్రపరుచుకుని, మరో ప్రతిని సంబంధిత అభ్యర్థికి అందజేయాలని సూచించారు. నగదు స్వీకరణ, ఖజానాలో జమ, రసీదుల జారీ వంటి అంశాల్లో పారదర్శకత పాటిస్తూ, లావాదేవీలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో వినియోగించే వివిధ ఫారాలు, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా అధికారులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రతి దశలో అవసరమైన పత్రాలను సక్రమంగా వినియోగించాలని, రికార్డుల్లో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థులకు నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనలపై సందేహాలు ఉంటే సంబంధిత మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ పూర్తయిన తర్వాత పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలను కూడా నిర్ణీత షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పురపాలక సంఘ పరిధిలోని 52 వార్డులకు నియమించిన ఎన్నికల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా ప్రతి అధికారి బాధ్యాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎస్పీ రవిబాబు, సీఐ ప్రసాద్, టీపీఓ అబ్దుల్ సత్తార్, మున్సిపల్ అధికారులు, 52 వార్డులకు నియమించిన ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ మున్సిపాలిటీకి కాసుల పంట! -నో డ్యూ సర్టిఫికెట్ల కోసం అభ్యర్థుల క్యూ..

**-కిటకిటలాడుతున్న మున్సిపల్ కార్యాలయం**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హిందూపురం పట్టణంలో రాజకీయ సందడి మొదలైంది. వార్డు కౌన్సిలర్లుగా, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నా రు. దీంతో పట్టణంలోని 52 వార్డుల్లో పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థుల రాకపోకలతో హిందూపురం మున్సిపల్ కార్యాలయం కిటకిటలా డుతోంది. నామినేషన్ల దాఖలుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకునే పనిలో ఆశావహులు నిమగ్నమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులు, ఇతర వర్తించే బకాయిలను పూర్తిగా చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ పొందేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నామినేషన్ ప్రక్రియలో అవసరమైన ధ్రువపత్రాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో తమ పేర్లపై ఉన్న బకాయిల వివరాలను తెలుసుకుంటూ, వాటిని చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వార్డు కౌన్సిలర్ అభ్యర్థుల నుంచి చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న వారి వరకు ఎన్నికల బరిలో దిగేందుకు అవసరమైన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. తమకు సంబంధించిన ఆస్తిపన్ను, ఇతర వర్తించే మున్సిపల్ బకాయిలను చెల్లించి అవసరమైన ధ్రువపత్రాలను పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ముందుగానే పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో మున్సిపల్ కార్యాల యంలో ఎన్నికల సందడి స్పష్టంగా కనిపిస్తోంది.

**ఎన్నికల ఎఫెక్ట్.. మొండి బకాయిల వసూళ్లకు ఊతం..**

సాధారణంగా మున్సిపల్ పన్నుల వసూళ్ల కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తితో అభ్యర్థులే స్వచ్ఛందంగా కార్యాలయానికి వచ్చి తమ బకాయిలను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో ఇన్నాళ్లుగా వసూలు కావాల్సిన పాత బకాయిలు సైతం వసూలవుతున్నాయి. ఎన్నికల సందడి ఒకవైపు రాజకీయ ఆశావహుల్లో ఉత్సాహాన్ని నింపుతుండగా, మరోవైపు పురపాలక సంఘం ఆదాయ వసూళ్లకు ఊతమిస్తోంది. 52 వార్డుల్లో పోటీకి ఆశావహుల సన్నాహాలు హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని 52 వార్డుల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు వేసుకుంటున్నారు. ఆయా వార్డుల్లో ప్రజాబలం, రాజకీయ సమీకరణాలు, పార్టీ టికెట్ల కేటా యింపులపై చర్చలు సాగిస్తూనే నామినేషన్లకు అవసరమైన పత్రాల సేకరణలో నిమగ్నమయ్యారు. మరోవైపు నో డ్యూ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయానికి వస్తుండటంతో అక్కడ రద్దీ పెరుగుతోంది. ఎన్నికల బరిలో నిలవాలంటే నామినేషన్ ప్రక్రియలో నిర్దేశించిన నిబంధనలు, అర్హతలను పాటించడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమకు సంబంధించిన బకాయిలను క్లియర్ చేసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. సంబంధిత నిబంధనల మేరకు సమర్పించిన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించి అర్హతపై నిర్ణయం తీసుకోనున్నారు. మొత్తంగా హిందూపురంలో మున్సిపల్ ఎన్నికల వేడి పెరుగుతున్న కొద్దీ పురపాలక సంఘం కార్యాలయంలో సందడి అధికమవుతోంది. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశావహుల ఉత్సాహం మున్సిపాలిటీకి బకాయిల రూపంలో ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. రాజకీయ పోటీకి రంగం సిద్ధమవుతున్న వేళ, ఎన్నికల ప్రభావంతో బకాయిల వసూళ్లు ఊపందుకోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**-రాజకీయ పార్టీల నాయకులకు మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి మల్లికార్జున, డీఎస్పీ రవిబాబు హెచ్చరిక**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి మల్లికార్జున, డీఎస్పీ రవిబాబు రాజకీయ పార్టీల నాయకులను హెచ్చ రించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకం గా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని వీసీ హాలులో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిబంధనలు, ప్రచార నియమాలు, నామినేషన్ల ప్రక్రియ, అభ్యర్థుల ఖర్చుల పరిమితులపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడు దల చేసిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో కులాలు, మతాలు, భాషల ఆధారంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా, ఇతరులను కించపరిచేలా ఎవరూ ప్రసంగించరాదన్నారు. ఓటర్లను కుల, మత ప్రాతిపదికన ప్రలోభాలకు గురిచేయడం నిషేధమని స్పష్టం చేశారు. మసీదులు, దేవాలయాలు, చర్చిలను ఎన్నికల ప్రచారానికి లేదా రాజకీయ స్వప్రయోజనాలకు వినియోగించరాదని సూచించారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా వారి ఇళ్లపై రాజకీయ జెండాలు కట్టడం, పోస్టర్లు అంటించడం, గోడలపై ప్రచార రాతలు రాయడం చేయరాదని తెలిపారు. లౌడ్‌స్పీకర్లను నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, పాటలు వినిపించడానికి ఉపయోగించరాదన్నారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలనుకునే వారు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపులు నిర్వహించే పార్టీలు వాటి ప్రారంభ సమయం, మార్గం తదితర వివరాలను ముందుగానే సంబంధిత అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఊరేగింపుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తప్పనిసరని అధికారులు తెలిపారు. అలాగే 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుమిగూడే విషయంలో అమలులో ఉన్న ఆంక్షలను పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం వరకు మాత్రమే ప్రచారానికి అనుమతి ఉంటుందని, 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మినహా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుమతి పత్రాలు కలిగిన వారికే ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాలు, పోలీసు సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించగా, ప్రస్తుతం బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఓటరు కౌన్సిలర్ అభ్యర్థికి ఒక ఓటు, చైర్‌పర్సన్ అభ్యర్థికి మరో ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు. చైర్‌పర్సన్‌గా పోటీ చేసే అభ్యర్థి గరిష్ఠంగా రూ.20 లక్షలు, కౌన్సిలర్‌గా పోటీ చేసే అభ్యర్థి రూ.7.50 లక్షల వరకు ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతించినట్లు తెలిపారు. అభ్యర్థులు ప్రచారానికి ఖర్చు చేసిన ప్రతి రూపాయికి సంబంధించిన వివరాలను ఎన్నికల అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పురపాలక సంఘంలో వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. రిజర్వు చేసిన వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే తమ ర్యాలీని నిలిపివేయాలని, అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. నామినేషన్ల పరిశీలన రోజున అభ్యర్థితో పాటు మరో వ్యక్తి మాత్రమే రావచ్చని

# పంచమ దుర్గ స్కంద మాత అలంకరణలో శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో' అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు కట్టి, బంగారు ఆభరణములు, సువాసనలు గోలిపే పుష్పాలతో శింగారించి, ధూప,దీప, నైవేద్య, కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని వాహన మండపము నకు తీసుకువచ్చి స్కందమాత అలంకరణ నిర్వహించి, స్కందమాత హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిఉభయదారులుగా చెందిన ఎం. రామనాథం రెడ్డి, ఎం.మోహన్ రెడ్డి, చిత్తూరు కు చెందిన బి.పార్థిబన్, బి.భారతి.పి.ఉదిత్ ఆర్య, పి.వర్ధిక, తిరుపతికి చెందిన డాక్టర్ పి.దామోదరం, డాక్టర్ బి. భువన దీప్తి వ్యవహరించిరి. వీరికి ఆలయ పీఠాధిపతి పూజారి సూరిస్వామి, వేద పండితులు జి. సీతారామ శర్మ తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించిరి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు పూజారి శివశంకర్ ప్రసాద్, వడ్డీ కాసుల రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.




# వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల ఐదవ రోజు దివ్య నగరోత్సవం

**శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకార శోభలో ప్రదోషవేళ**
**కనులపండువగా ఆదిదంపతుల పవిత్ర యాత్ర**
**శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి నగరోత్సవాన్ని ప్రారంభించిన ఈవో వి.కె. శీనా నాయక్**
**శాక్సోఫోన్ నాదం, కేరళ పంచవాద్యాలు, నయాండీ మేళం, కోలాటాల కోలాహలం**
**కృష్ణా తీరం, ఘాట్ రోడ్డు మీదుగా సాగిన దివ్య రథయాత్ర**
**- రాజగోపురం ముంగిట విశేష పూజలు**



ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత భక్తిప్రపత్తులతో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఐదవ రోజైన గురువారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పవిత్ర నగరోత్సవం నయనానందకరంగా, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా జరిగింది. ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు త్రిపురత్రయ పూజిత, సర్వసౌభాగ్య ప్రదాయిని అయిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి



దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమి స్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు అర్చక బృందం శాస్త్రోక్తం గా విశేష పూజలు, పంచహారతులు నిర్వహిం చారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణా ధికారి వి.కె. శీనా నాయక్ సంప్రదాయ బద్ధంగా కొబ్బరికాయ కొట్టి నగరోత్సవ రథయాత్రను ప్రారంభించి, స్వయంగా రథోత్సవంలో పాల్గొన్నారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో నగరోత్సవ రథం ముందుకు సాగుతుండగా సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, కేరళ సంప్రదాయ పంచవాద్యాల దరువులు, తమిళ సంప్రదాయ నయాండీ మేళం దరువులతో పాటు మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు భక్తులను పరవశింపజేశాయి. ఈ వాద్య-నృత్య విన్యాసాలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేవస్థానం నుండి ప్రారంభమైన దివ్య రథయాత్ర రథం కొండపైకి చేరుకుంది. భక్తజన నీరాజనాలు: విద్యుద్దీపాలు, సుగంధ పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన రథంపై అధిష్ఠించిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు పురవీధుల్లో వేలాది మంది భక్తులు బారులు తీరారు. మార్గమధ్యంలో భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ, ధూపదీప కర్పూర నీరాజనాలతో స్వామి, అమ్మవార్లను కీర్తిస్తూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. ఊరేగింపు ఘనంగా ఇంద్రకీలాద్రి పైకి చేరుకున్న అనంతరం ఆలయ రాజగోపురం ముంగిట పల్లకీ నిలిపి, ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, దివ్య మంగళ హారతులతో ఆస్థానం కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రుల వేళ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకార శోభలో కొలువుదీరిన ఆదిదంపతులను రథారూఢులుగా దర్శించుకోవడం వల్ల సకల మనోభీష్టాలు నెరవేరుతాయని, కుటుంబంలో సౌభాగ్యం, శాంతి చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మహోత్సవంలో దేవస్థాన సిబ్బంది, అశేష భక్తజనం పాల్గొని శ్రీ దుర్గా మల్లేశ్వరుల కృపాకటాక్షాలను పొందారు.

# భక్తులకు అన్నప్రసాద వితరణ..

**సేవాభావానికి ప్రతీకగా కొత్తమ్మతల్లి జాతర!**
**కోటబొమ్మాళిలో అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు**
**భక్తులకు అన్నం పెట్టడం దైవసేవతో సమానం..**
**జాతరలో అన్నదానానికి విశిష్ట స్థానం**



ప్రజాభూమి ప్రతినిధి,కోటబొమ్మాళి:

శ్రీ శ్రీ శ్రీ కొత్తమ్మతల్లి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం కోటబొమ్మాళిలో నిర్వహించిన అన్న వితరణ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**భక్తి.. సేవ.. మానవత్వానికి ప్రతిరూపం అన్నదానం**

భారతీయ సంస్కృతిలో అన్నదానానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ఆకలితో వచ్చిన వారికి ఆహారం అందించడం, భక్తులకు ఆప్యాయంగా అన్నప్రసాదం వడ్డించడం సాక్షాత్తూ దైవసేవగా భావిస్తారు. జాతరలు, ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అన్న వితరణ కార్యక్రమాలు భక్తిభావాన్ని చాటడమే కాకుండా సమాజంలో సేవాగుణాన్ని, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి. అన్నం పరబ్రహ్మ స్వరూపమనే నమ్మకానికి ప్రతీకగా నిలిచే అన్నదానం.. ఆకలిని తీర్చడంతో పాటు ఆత్మీయతను పంచుతుంది.

**అమ్మవారి సన్నిధిలో సేవాభావం వెల్లివిరిసేలా..**

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో భాగంగా అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి సేవా కార్యక్రమాలు ఉత్సవాల ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ఇనుమడింపజేస్తాయి. భక్తులకు సేవ చేయడం, వారి అవసరాలను గుర్తించి తోడ్పాటునందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాయి. శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుండగా.. అన్న వితరణ వంటి కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొస్తున్నాయి.కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ చిన్న గోవింద్, కళింగ వైశ్య చైర్మన్ బోయిన గోవిందరాజులు , నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

ప్రజాభూమి



## మహంకాళి అవతారంలో తుమ్మలమ్మ తల్లి దర్శనం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలోని తుమ్మలమ్మ తల్లి ఆలయం వద్ద విజయదశమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజు అమ్మవారు మహంకాళి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# క్షయ వ్యాధి నివారణకు ఉచిత ఎక్స్‌రే శిబిరం

## 70 మందికి పరీక్షలు.. ఐదుగురికి తదుపరి వైద్య పరీక్షల కోసం సిఫారసు

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ప్రధానమంత్రి క్షయ వ్యాధి రహిత భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 70 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఐదుగురిని తదుపరి నిర్ధారణ పరీక్షల కోసం నూజివీడు ప్రభుత్వ క్షయ వ్యాధి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకా



రం ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్క లం, ఆగిరిపల్లి, సూరవరం, బొద్దనపల్లి గ్రామాలను క్షయ వ్యాధి ముప్పు అధికంగా ఉన్న గ్రామాలుగా గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ గ్రామాల్లో త్వరలో ఉచిత ఎక్స్‌రే శిబిరాలు నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు నూజివీడు ప్రాంతీయ ఆసుపత్రిలోని ప్రభుత్వ క్షయ వ్యాధి వైద్యశాలను పనిదినాల్లో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహిత, క్షయ వ్యాధి నివారణ విభాగం సిబ్బంది ఎస్టీఎస్ ఎం. జగన్మోహన్ కృష్ణ, ఎస్టీఎల్ఎస్ బొబ్బర్ల సురేష్, క్షయ వ్యాధి ఆరోగ్య సందర్శకురాలు కె. జ్యోతి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలోని స్థానిక యాదవ మండపంలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం ఐదవ రోజు అమ్మవారు శ్రీ లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నిత్య పూజలు, సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించి, అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. శుక్రవారం మూలా



నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి దివ్య దర్శనం చేసుకుని, అన్నప్రసాదం స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

# జిల్లాలో సర్పంచి వార్డు మెంబర్లకు రిజర్వేషన్లు ఖరారు

ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

ఏలూరు, జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలకు సంబంధించి 542 సర్పంచ్ లు , 5676 గ్రామ వార్డ్ మెంబెర్స్ పదవులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలియజేసారు.

**గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు రిజర్వేషన్లు.**

జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలకు సంబంధించి మహిళలకు 266 స్థానాలు, జనరల్ కు 276 స్థానాలు కేటాయించారు. వాటిలో షెడ్యూల్డ్ ఏరియాలోని 63 స్థానాలకుగాను మహిళలకు 31 స్థానాలు , జనరల్ కు 32 స్థానాలు , 100 శాతం షెడ్యూల్డ్ తెగల తండాలు కలిగిన 2 ఎస్టీ పంచాయతీలలో ఒకటి మహిళలకు, ఒకటి జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా నాన్ -షెడ్యూల్డ్ ప్రాంతాలలోని 479 స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ తెగలకు 6 స్థానాలకు గాను 2 మహిళలకు, 4 జనరల్ కు, షెడ్యూల్డ్ కులాలలకు 121 స్థానాలకు గాను 56 మహిళలకు, 65 జనరల్ కు, వెనుకబడిన తరగతులకు 104 స్థానాలకు గాను 52 మహిళలకు, 52 జనరల్ కు, రిజర్వు కాని కేటగిరీకి 246 స్థానాలకు గాను 124 మహిళలకు, 122 జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు.

**వార్డ్ మెంబెర్స్ స్థానాలకు రిజర్వేషన్లు**

జిల్లాలోని 5676 వార్డ్ మెంబర్ల స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ ఏరియాలోని 63 గ్రామ పంచాయతీలలోని 626 వార్డ్ మెంబర్ల స్థానాలకుగాను మహిళలకు 313 స్థానాలు ,



జనరల్ కు 313 స్థానాలు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలకు 403 స్థానాలకు గాను 187 స్థానాలు మహిళలకు, 216 స్థానాలు జనరల్ కు కేటాయించారు. రిజర్వు కాని కేటగిరీకి సంబంధించి 223 స్థానాలకు గాను 126 మహిళలకు, 97 జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోని 479 గ్రామ పంచాయతీలలోని 5050 వార్డ్ మెంబర్ల స్థానాలకుగాను మహిళలకు 2525 స్థానాలు , జనరల్ కు 2525 స్థానాలు కేటాయించారు. షెడ్యూల్డ్ తెగలకు 92 స్థానాలకు గాను 37 మహిళలలకు, 55 జనరల్ కు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలకు 1289 స్థానాలకు గాను 560 స్థానాలు మహిళలకు, 729 స్థానాలు జనరల్ కు కేటాయించారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి 1099 స్థానాలకు గాను 521 మహిళలకు , 574 జనరల్ కు కేటాయించారు. రిజర్వు కాని కేటగిరీకి సంబంధించి 2570 స్థానాలకు గాను 1407 మహిళలకు, 1163 స్థానాలు జనరల్ కు కేటాయించినట్లు కలెక్టర్ తెలియజేశారు.

# నెల్లిపూడిలో మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైద్య శిబిరం రోగులకు ఉచితంగా వైద్య సేవలు

ప్రజా భూమి ప్రతినిధి-గంగవరం

పోలవరం జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పోలవరం జిల్లా గంగవరం మండలం నెల్లిపూడిలో బుద్దిగ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తన తల్లిదండ్రులు బుద్దిగ చిరంజీవిరావు లక్ష్మి తులసి జ్ఞాపకార్థం ఆయన ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు శిబిరంలో భాగంగా రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం రమా దంత వైద్యశాల ఆధ్వర్యంలో దంత వైద్య




శిబిరం నిర్వహించారు ఇతర ఆసుపత్రులకు చెందిన వైద్య నిపుణులు సైతం పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు సేవలు అందించారు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈ సందర్భంగా బుద్దిగ సతీష్ గౌడ్ సేవలను పలువురు అభినందించారు అనంతరం ఎంఆర్పీఎస్ నాయకులు,స్థానిక నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో నరసింహారావు,రాంబాబు సతీష్ గౌడ్ కుటుంబ సభ్యులు ఎంఆర్పీఎస్ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు



గ్రామస్థులు పాల్గొన్నారు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

# ఎన్నికల విధులపై పూర్తి అవగాహనతో బాధ్యతలు నిర్వర్తించాలి..!

## ఆర్ఓలు, ఏఆర్ఓలు, ప్రిసైడింగ్ అధికారులకు జేసీ డా. నిధి మీనా సూచనలు

ప్రజాభూమి ప్రతినిధి-కడప

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలపై పూర్తి అవగాహన పెంచుకుని, తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులకు సూచించారు.గురువారం కడప కలెక్టరేట్ లోని సభా భవనంలో ఎన్నికల విధుల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), ప్రిసైడింగ్ అధికారులకు



నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జేసితో పాటు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్. ఎస్. భావన, కడప ఆర్డీవో మురళీ, డిప్యూటీ కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల మార్గదర్శకాల పుస్తకాలను అందజేసి, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, అధికారుల విధులు, బాధ్యతలను జేసీ వివరించారు.

ఎన్నికల విధులకు సంబంధించి అధికారులకు ఎదురయ్యే సందేహాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి తన పాత్రను స్పష్టంగా అర్థం చేసుకుని, నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు.

## ఏలూరు మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

### ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలి: జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ పోలీసు అధికారులను ఆదేశించారు.గురువారం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎన్నికల భద్రత,పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రద్దీ,తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల సమయంలో ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, నగరంలోని వన్‌టౌన్,టూటౌన్,త్రీటౌన్ పోలీసు ఇన్‌స్పెక్టర్లు,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సూచనలు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.అనారోగ్యంతో బాధపడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 12 మంది నిరుపేద లబ్ధిదారులకు ఈ సందర్భంగా చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు అనంతరం తెలుగుదేశం మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు మండలంలో అనేక మందికి లక్షల రూపాయల సాయం అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులందరూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నోముల రామారావు, పాయం వెంకయ్య, జనసేన మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర, టీడీపీ మండల ఉపాధ్యక్షులు చెలికాని ఉమామహేశ్వరరావు, రసూల్, బండారు శివయ్య, హెచ్.రవి, చెలికాని బాలు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాలో 186 సర్పంచ్, 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజావాణి ప్రతినిధి-రంపచోడవరం

రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలవరం జిల్లాలోని 186 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ కె. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం--1994, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నం.154, తేదీ 12.10.2026 ప్రకారం ఖరారు చేసిన రిజర్వేషన్ల వివరాలను గురువారం (అక్టోబర్ 15) జిల్లా అసాధారణ గెజిట్‌లో ప్రచురించినట్లు వెల్లడించారు.

**సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు:**

జిల్లాలోని 186 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలకు 186 స్థానాలు కేటాయించారు. వీటిలో మహిళలకు 90, జనరల్ కేటగిరీకి 96 స్థానాలు కేటాయించినట్లు వివరించారు.

**వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్లు:**

జిల్లాలోని 186 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటిలో షెడ్యూల్డ్ తెగలకు 1,383 స్థానాలు (మహిళలు--659, జనరల్--724), అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీకి 351 స్థానాలు (మహిళలు--142, జనరల్--209) కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం వార్డు సభ్యుల స్థానాల్లో మహిళలకు 866, జనరల్ కేటగిరీకి 868 స్థానాలు కేటాయించినట్లు వివరించారు.సర్పంచ్ స్థానాలకు సంబంధించి సంబంధిత సబ్ కలెక్టర్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఆయా కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలను జిల్లా అసాధారణ గెజిట్‌లో ప్రచురించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ కె. దినేష్ కుమార్ తెలిపారు

# శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ సీటు సాధించిన అరుణ కుమారికి ఘన సన్మానం

## విద్యలో రాణిస్తూ ఆదివాసీ హక్కుల సాధనకు కృషి చేయాలి: కుంజా శ్రీను

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2026--29 విద్యా సంవత్సరానికి మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో సీటు సాధించిన కారు అరుణ కుమారిని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్, పోలవరం జిల్లా ఆధ్వర్యంలో అడ్డతీగల మండలం సరంపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతం నుంచి ఉన్నత విద్యలో ముందడుగు వేస్తున్న అరుణ కుమారి విజయం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యలో రాణిస్తూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్తులో ఆదివాసీలతో పాటు బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. న్యాయవాద వృత్తి ద్వారా ప్రజలకు సేవలందించి, అణగారిన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అరుణ కుమారితో పాటు ఆమె భర్త, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీఠ ప్రసాద్ దంపతులకు రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అరుణ కుమారి సాధించిన విజయాన్ని అభినందిస్తూ ఆమె ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోదీద నూకరాజు, చోడి ప్రదీప్ కుమార్ దొర, చోడి ఏడుకొండలు రావు దొర, బల్లెం గంగాభవాని, లంద శారదాదేవి, కలుముల ప్రసాద్ దొర, పరదా శివ రామకృష్ణ, కలిమి కోట శ్రీను, అన్నిక



శ్రీను, అరుణ కుమారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన..!

### భద్రతా ఏర్పాట్లపై అధికారులకు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా సూచనలు



**ప్రజాభూమి ప్రతినిధి–కడప**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కడపలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మూడు స్ట్రాంగ్ రూమ్‌లు, మూడు ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల సామగ్రి భద్రత, కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జేసితో పాటు కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కడప డీఎస్పీ టి. భవానీ పాల్గొని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించారు

# భక్తుల సేవలోనే అధికార యంత్రాంగం

- మూలా నక్షత్రాన అమ్మ దర్శనానికి ఆటంకం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చినా ఇబ్బంది లేదు
- సాయంత్రం 4–4.30 గంటల మధ్యలో ఇంద్రకీలాద్రికి ముఖ్యమంత్రి
- 450 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- భక్తులకు మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, అన్న ప్రసాదం పంపిణీ
- వర్షం కురిసినా అమ్మవారి దర్శనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- కొండరాళ్లపై నిరంతర నిఘా.. ప్రత్యేక సాంకేతిక బృందం పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, దేవాదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్

**ప్రజాభూమి ప్రతినిధి–ఇంద్రకీలాద్రి**

ఇంద్రకీలాద్రిపై మూలా నక్షత్రం సందర్భంగా మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. భక్తులకు సౌకర్యవంతంగా, సురక్షితంగా అమ్మవారి దర్శనం కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, పోలీసు, దేవస్థానం అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ దర్శన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

మూలానక్షత్రం రోజున అనుసరించాల్సిన ప్రణాళికపై గురువారం కొండ దిగువ భాగాన ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌజ్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ తదితరులు సమావేశమయ్యారు. స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాదశర్మ సమక్షంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. హోల్డింగ్ పాయింట్లతో పాటు క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, అన్నప్రసాదం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. మూలా నక్షత్రం రోజున వర్షం కురిసినా భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహామండపం ద్వారా దర్శనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. కొండరాళ్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశామని, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భక్తులు హడావుడి పడకుండా సంయమనం పాటిస్తూ, అధికారుల సూచనలను అనుసరించి క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల మధ్యలో ముఖ్యమంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని



వివరించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రస్తుతం 3,500 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారని.. మూలానక్షత్రం రోజును పురస్కరించుకొని అదనంగా 900 మందికి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. ఎంత సమయంలో అమ్మవారి దర్శనం లభిస్తుందనే దాంతో పాటు వివిధ అంశాలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా గంట గంటకూ బులెటెన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించనున్నట్లు వెల్లడించారు. డేటా అనలిటిక్స్ ద్వారా ఎంత సమయంలో అమ్మవారి దర్శనమవుతుందో కచ్చితత్వంతో తెలియజేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మూలా నక్షత్రం రోజున సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని.. వీఐపీ పాస్‌లను రద్దుచేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసులతో పాటు అధికార యంత్రాంగం చేసే సూచనలు పాటించి సహకరించాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ గతేడాదితో పోల్చితే ఈసారి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఈసారి మూలానక్షత్రం రోజున 2,50,000 నుంచి మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఎప్పుడు ఎక్కడ ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికత సహాయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వైదిక కమిటీ సభ్యులతోనూ చర్చించి భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనం లభించేలా ఏర్పాట్లు చేసినట్లు రామచంద్రమోహన్ పేర్కొన్నారు.

# తిరుపతి రూరల్ జడ్పీటీసీ బరిలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- చంద్రగిరి నియోజకవర్గంలో తొలి అభ్యర్థిత్వం ఖరారు
- ఐక్యంగా పనిచేసి గెలిపించుకుంటామన్న పార్టీ నేతలు

**ప్రజా భూమి ప్రతినిధి–తిరుపతి రూరల్**

స్థానిక ఎన్నికల వేళ చంద్రగిరి నియోజకవర్గ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ తొలి అడుగు వేసింది. చంద్రగిరి నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వంలో తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పేరును ఖరారు చేసినట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తొలుత అభ్యర్థిత్వం వెల్లడైన స్థానంగా తిరుపతి రూరల్ నిలిచింది. హర్షిత్‌రెడ్డి అభ్యర్థిత్వంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేయగా, గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేస్తామని నాయకులు ప్రకటించారు. తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ



కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తిరుపతి రూరల్ మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు. జడ్పీటీసీ అభ్యర్థిగా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల బరిలో వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**సమష్టి కృషితో విజయం సాధిస్తాం**

తిరుపతి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో హర్షిత్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడం సంతోషకరమన్నారు. ఆయన విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని తెలిపారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దామినేటి కేశవులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో హర్షిత్‌రెడ్డి కూడా భాగస్వామిగా ఉన్నారని పేర్కొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం తిరుపతి రూరల్ జడ్పీటీసీగా ప్రారంభమైందని గుర్తు చేశారు. అదే స్థానం నుంచి హర్షిత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. మాజీ ఎంపీపీ, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చిలమంద మునికృష్ణ మాట్లాడుతూ హర్షిత్‌రెడ్డి అభ్యర్థిత్వానికి చెవిరెడ్డి కుటుంబం ఆమోదం తెలిపిందని, గెలుపు బాధ్యతలను పార్టీ శ్రేణులు సమష్టిగా తీసుకుంటాయని అన్నారు. అభివృద్ధి, ప్రజాసేవకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎన్నికల్లో ముందుకు సాగుతామని తెలిపారు.

హర్షిత్ రెడ్డి గెలుపును పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కానుకగా అందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం ప్రధాన కార్యదర్శి అవిలాల లోకనాథరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నియాదవ్, వైఎస్సార్‌సీపీ నేత తులసీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించిన కేఎంసి కమిషనర్

**ప్రజాభూమి ప్రతినిధి–కడప**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన బిఏర్పాట్లను గురువారం కడప నగరపాలక సంస్థ (కేఎంసి) కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్ రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కడప నగరపాలక పరిధిలో ఏర్పాటు చేసిన పలు నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు.

## పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

### నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ**



గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని పటిష్టంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ప్రవర్తనా నియమావళిని నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, రాజకీయ నాయకులు లేదా రాజకీయ పార్టీల వివరాలన్నింటినీ తొలగించాలి లేదా కప్పి ఉంచాలని.. అదేవిధంగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు, ప్రకటనల్లో రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల ఫొటోలు, పేర్లు, గుర్తులు, సందేశాలను తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను పూర్తిగా కప్పి ఉంచాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం జారీచేసే విద్యుత్, నీటి బిల్లులపై రాజకీయ ప్రచారానికి సంబంధించిన ఫొటోలు, సందేశాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎంసీసీకి సంబంధించిన అన్ని మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని.. నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# శ్రీ స్కందమాతా దేవి అలంకారంలో శ్రీ దుర్గమ్మ తల్లి

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

**ప్రజా భూమి ప్రతినిధి–వేంపల్లె**

స్థానిక పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ దుర్గమ్మ తల్లి శ్రీ స్కందమాతా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం. రవికుమార్ రెడ్డి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీ స్కందమాతా దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజే



శారు. ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

- నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించాలి
- రిటర్నింగ్ అధికారులు ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల ఉపసంహరణ తదితర అంశాల్లో ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు), ఎన్నికల అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నామినేషన్ల స్వీకరణకు తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన ఏర్పాట్లు, ఎన్నికల నిబంధనల అమలుపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ అనేది పూర్తిగా నిబంధనలకు లోబడి జరిగే ప్రక్రియ అని, అధికారులు తమ వ్యక్తిగత అభిప్రాయాల ఆధారంగా కాకుండా ఎన్నికల నియమావళి, అధికారిక హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సంబంధిత హ్యాండ్‌బుక్‌లను క్షుణ్ణంగా చదివి, నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన వరకు అనుసరించాల్సిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో తలెత్తే అనేక సందేహాలకు నిబంధనల పుస్తకంలోనే పరిష్కారాలు ఉంటాయని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఫారాలు, చెక్‌లిస్టులు, ఇతర సామగ్రి ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ప్రతి రిటర్నింగ్ అధికారి తన పరిధిలో సమర్థవంతమైన బృందాన్ని ఏర్పాటు



చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని సమన్వయంతో నిర్వహించేలా సిబ్బందికి విధులు కేటాయించాలని, అవసరమైతే రాతపూర్వకంగా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. బృందాల ఏర్పాటు, సిబ్బంది విధుల నిర్వహణలో లోపాలు ఉంటే సంబంధిత మున్సిపల్ కమిషనర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణకు వచ్చే అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, నామినేషన్ పత్రాల్లోని వివరాలు, సంతకాలు, జతచేయాల్సిన ధ్రువపత్రాలు, డిపాజిట్ చెల్లింపు తదితర అంశాలను ముందస్తుగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలు, ఎన్నికల వ్యయ ఖాతా, గుర్తుల ఎంపికకు సంబంధించిన ప్రకటనలు, రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల కుల ధ్రువీకరణ పత్రాలు వంటి అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన పన్నుల బకాయిలు లేవని నిర్ధారించే నో డ్యూస్ సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థితో కలిపి గరిష్ఠంగా ముగ్గురినే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించాలని, నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో వాహనాల నియంత్రణ, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని, ప్రతి కార్యాలయంలో డిజిటల్ గడియారం ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణకు నిర్ణయించిన గడువును కచ్చితంగా పాటించాలని, గడువు ముగిసిన అనంతరం కార్యాలయంలోకి వచ్చిన వారిని, ముందుగా నిర్ణీత సమయంలో లోపలికి వచ్చిన అభ్యర్థుల విషయంలో వర్తించే నిబంధనలను వేర్వేరుగా పరిగణించి అధికారిక మార్గదర్శకాల ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ప్రతిపాదకుల వివరాలను 2026 జనవరి 1 నాటికి ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా ధ్రువీకరించాలని, సంబంధిత వార్డులో ప్రతిపాదకుడికి ఓటు ఉందో లేదో పరిశీలించాలని తెలిపారు. నామినేషన్ పత్రాల్లో చిన్నపాటి లేఖన సంబంధిత పొరపాట్ల కారణంగా నామినేషన్లను తిరస్కరించకుండా, నిబంధనల ప్రకారం అభ్యర్థులకు తగిన సహకారం అందించాలని సూచించారు. ప్రతి నామినేషన్‌కు వరుస సంఖ్య కేటాయించాలని, రోజువారీగా అందిన నామినేషన్ల వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని, నామినేషన్లు అందని సందర్భంలోనూ 'నిల్'గా నమోదు చేసి ప్రదర్శించాలని ఆదేశించారు.

స్వీకరించిన ప్రతి నామినేషన్ వివరాలను ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అదే రోజు నమోదు చేయాలని, నామినేషన్ పత్రాలు, జతపరిచిన ధ్రువపత్రాలు, డిపాజిట్‌కు సంబంధించిన రికార్డులను రిటర్నింగ్ అధికారి ఆధీనంలో భద్రంగా ఉంచాలని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రోజువారీ నివేదికలను సకాలంలో మున్సిపల్ కమిషనర్లకు పంపాలని, అక్కడి నుంచి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి, తదుపరి రాష్ట్ర ఎన్నికల అధికారులకు నివేదికలు చేరేలా సమన్వయం పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం, పురపాలక పరిపాలన శాఖ అందించిన మార్గదర్శకాలు, ప్రజెంటేషన్లు, నమూనా ఫారాలను అధ్యయనం చేసి ముందస్తు సన్నద్ధతతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి అధికారి ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకుని, తమ బృందాలను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించినప్పుడే ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించడం సాధ్యమవుతుందని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.